మే - 2024

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక


**సంపాదకులు :**

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**

B.A.,B.L.,


**చందా వివరాలు :**

**సంవత్సర చందా రూ. 350/-**

పోషక చందా రూ. 1500/-

జీవితచందా రూ. 5000/-


**చిరునామా :**

ఎడిటర్, హన్నాకృప

పోస్ట్‌బాక్స్ నెం. 51 , క్లౌపేట, 6వలైను

ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా

సెల్ : 9440217726


**బ్యాంకు అకౌంటు వివరాలు :**

A/c Name: **K. Emmanial Rajendra**

A/c No.: **10957294340**

Bank: SBI Main Branch, Ongole

IFSC Code : SBIN0000890

## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఇతరులను క్షమించాలి | 02 |
| జప్పత్వనేహు | కొడవటికంటి | 03 |
| నా చిత్తానుసారుడు | కొడవటికంటి | 06 |
| డౌన్ టు ఎర్త్ | కె.ఇ. రాజేంద్ర | 08 |
| ఆత్మీయ సిద్ధపాటు | డా॥ సుష్మ, నెల్లూరు | 09 |
| మధ్యకాలము | హన్నాకృప డెస్క్ | 10 |
| నీ సృష్టికర్త | హన్నాకృప డెస్క్ | 11 |
| నా జీవిత ఆధారం క్రీస్తు | సాక్ష్యము | 13 |
| క్రొత్తకోణాలు | అద్దంకి జాన్‌వెస్లీ | 15 |
| కృపాదానం | కొడవటికంటి | 18 |
| మరియ | స్త్రీల కొరకు | 20 |
| ధైర్యం | చిన్నపిల్లల పేజి | 22 |
| బైబిల్ క్విజ్-05 | | 24 |



**HANNA KRUPA**

**Christian Devotional Monthly Magazine**

**సంపుటి : 21 సంచిక : 05**


**ప్రభువగు యెహోవాయే నాకు బలము**

సీరియల్ నంబరు

సంపాదకీయం....

# ఇతరులను క్షమించాలి

హన్నాకృప పాఠకులకు ప్రభువు నామమున వందనములు!

ఇతరులను క్షమించే విషయంలో మనం చాలా కఠినంగా వ్యవహరిస్తాము. ఎదుటి వాళ్ళు చేసిన తప్పునుబట్టి మన నిర్ణయం చాలా కఠినంగా ఉంటుంది. ఒక్కొసారి మన పట్ల తప్పు చేసిన వారిని తలుచుకుంటేనే కోపం రెట్టింపు అవుతుంది. దేవున్ని ఎరుగని అన్యజనుల సంగతి ఎలా ఉన్నా క్రైస్తవులని చెప్పుకొనే వారు సైతం ఇతరులను క్షమించే విషయంలో అన్యజనుల్లానే ఉంటారు. మనం ఇతరులని క్షమించలేకపోతున్నాము అంటే మనలో దేవుడు లేనట్టేనని భావించాలి. 'మనుష్యుల అపరాధములను మీరు క్షమించిన యెడల, మీ పరలోకపు తండ్రియు మీ అపరాధములను క్షమించును. మీరు మనుష్యుల అపరాధములను క్షమించకపోయిన యెడల మీ తండ్రియు మీ అపరాధములను క్షమించడు' (మత్తయి 6:14,15). మనం ఏదైనా తప్పు చేసినప్పుడు దేవుని దగ్గర క్షమాపణ అడుగుతాము కదా! దేవుడు మనల్ని క్షమించాలంటే మనం కూడా ఇతరులను క్షమించి ఉండాలి. మనపట్ల ఇతరులు చేసిన తప్పుల్ని మనం క్షమించకుండా మనం చేసిన తప్పుల్ని దేవుడు క్షమించాలంటే దేవుడు ఒప్పుకోడు. మనకి క్షమించే మనస్సు లేనప్పుడు మన ప్రార్ధనలు దేవుడు అంగీకరించడు. 'మీకు ఒకని మీద విరోధమేమైనను కలిగియున్న యెడల, మీరు నిలువబడి ప్రార్ధన చేయునప్పుడెల్లను వాని క్షమించుడి' (మార్కు 11:25). మనకి మనం అత్యధిక ప్రాధాన్యత ఇచ్చుకోవడం, మనల్ని మనం హెచ్చించుకోవడం వలన ఇతరులని క్షమించలేము. మనల్ని మనం హెచ్చించుకున్నప్పుడు మనలో ఉండే అహం ఇతరులను క్షమించనియ్యదు. ముందుగా మనల్ని మనం తగ్గించుకోగలిగితే ఎదుటివారిని క్షమించటం కొంతవరకు సాధ్యమవుతుంది. మనం ఇతరులని క్షమించలేనప్పుడు మనం కూడా ప్రశాంతంగా ఉండలేము. వారిని క్షమించగలిగినప్పుడు మాత్రమే మన మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. ఒకవేళ ఎదుటివారి వలన మనకి ఏదైనా ముప్పు ఉన్నా, వాళ్ళు మనల్ని ద్వేషిస్తున్నా, వారికి దూరంగా ఉండాలే తప్ప పగ తీర్చుకోవాలనుకోకూడదు, ద్వేషాన్ని కలిగి వుండకూడదు. అలాంటి వారిని దేవుని చేతికి అప్పగించాలి. అప్పుడు దేవుడే న్యాయమైన తీర్పు తీరుస్తాడు. ఒకవేళ అప్పగించకుండా మనమే పగతీర్చుకోవాలనుకుంటే దేవుడు మన పక్షముగా ఉండడు కాబట్టి అది అనేక అనర్ధాలకు దారితీస్తుంది. దేవున్ని మనం హృదయపూర్వకంగా ప్రేమించగలిగితే ఇతరులను క్షమించడం మనకు సులభంగా ఉంటుంది. మనం ఒక్కటే గుర్తుంచుకోవాలి, దేవుడు మన పాపములను క్షమిస్తున్నాడు కాబట్టి మనం కూడా ఇతరులు మనపట్ల చేసే తప్పులను క్షమించాలి. 'ఎవడైనను తనకు హాని చేసెనని యొకడనుకొనిన యెడల ఒకనినొకడు సహించుచు ఒకనినొకడు క్షమించుడి, ప్రభువు మిమ్మును క్షమించిన లాగున మీరును క్షమించుడి' (కొలస్స. 3:13). మనం ఇతరులను క్షమించలేకపోతున్నామంటే మనం దేవున్ని ప్రేమించటం లేదని అర్ధము. కాబట్టి మనం దేవున్ని ప్రేమిస్తున్నామో లేదో ఇతరులను క్షమించటం ద్వారానే తెలుస్తుంది. దేవునితో సమస్తము సాధ్యమని మనం గుర్తుంచుకోవాలి. ఇప్పటి నుండి మిమ్మును ద్వేషించే వారిని క్షమించడానికి ప్రయత్నించండి. దేవుడు మీకు తప్పక సహాయపడతాడు.

***-ఎడిటర్, కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర***

**K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole**
**A/c No. 10957294340**

సీరియల్

# జప్నత్పనేహు

24

(యోసేపు జీవిత చరిత్ర)

– కొడవటికంటి

యోసేపు మాట్లాడుతుంటే అక్షాపు ముఖం మారి పోయింది. బలవంతుని ఒక బలహీనుడు మంత్రంతో బంధించినంత నిస్సహాయస్థితిలో ఉన్నట్లు చూసాడు. యోసేపు వెంటనే లేచి అక్షాపుతో ఒక్క మాట కూడా చెప్పకుండా గబగబా బయటకువచ్చి, గుర్రం ఎక్కి చీకట్లో మాయమై పోయాడు.

ఆ రోజు చాలా పొద్దుపోయిన దాక నిద్ర లేవలేదు. ఒళ్ళంతా నొప్పిగా ఉంది. తను ఈరోజు చెయ్యవలసిన పనులు ఎన్నో ఉన్నాయి అనుకుంటూ, నిన్న తను తిరిగిన ప్రదేశాలన్నీ జ్ఞాపకం చేసుకుంటూ సిద్ధపడ్డాడు. నిన్నంతా దాదాపు భోజనం చెయ్యనట్లుగానే ఉంది. నీరసంగా ఉంది. పది గంటలకు మెముకాన్ వచ్చి పోతీఫరు పిలుస్తున్నారని చెప్పి వెళ్ళిపోయాడు.

ఇంత సమయం వరకు కొలువుకు ఎందుకు వెళ్ళ లేదనుకుంటూ, తొందరగా పోతీఫరు గదికి వెళ్ళాడు. కాని ద్వారపాలకులు ఎవరు బయట లేనందున బహుశా యజ మానురాలి దగ్గర ఉండవచ్చును అనుకుంటూ, ఆమె గది దగ్గరకు వస్తే, అక్కడ కూడా ఎవరూ ద్వారపాలకులు లేరు. 'అందరూ ఎక్కడకు పోయారు? అనుకుంటూ తలుపు తడితే, తెరచుకుంది. లోనికి ఒక అడుగువేసి "మెముకాన్" అని పిలిచాడు. ఎవరూ పలుకలేదు. మరలా రెండు అడుగులు వేసి, మరలా "మెముకాన్" అని పిలిచాడు. లోపల గదిలో నుండి యజమానురాలి గొంతు వినబడింది.

"యోసేపు, తలుపు వేసి లోపలకు రా" అంది.

కొంచెం ఆగి తలుపువేసి లోపలకు నడిచాడు. యజ మానురాలు కుడిచెయ్యి తలక్రింద ఆనించి పండుకొని ఉంది. యోసేపు నిలుచుని ఉన్నాడు. ఆమె యోసేపు వైపు కొంచెం నిదానించి చూసి, "నువ్వు ఇక్కడికి కొనుక్కొని తేబడిన వాడవని మర్చిపోయావా?" అని అన్నది.

ఆ మాటలు మృదువుగా అన్నప్పటికీ అందులో దర్పమే కనబడుతుంది. ఎందుకో ఈసారి ఆమె ముఖంలో అందం కనిపించలేదు. మృదుత్వం కనిపించలేదు సరికదా, ఒక రకమైన ఏహ్యాభావం కలిగింది.

"దగ్గరకి రా!" అని పిలిచింది. యజమానురాలు తన కుక్కపిల్లని పిలిచినట్లుగా.

యోసేపు ఆమె మంచం దగ్గరగా వచ్చాడు. వెంటనే ఆమె ఎడమ చేతితో యోసేపు నడుము మీద చెయ్యివేసి బలంగా మంచం మీదకు లాగింది. అనుకోని సంఘటన ఊహించని యోసేపు ఆమె మీద బోర్లగా పడిపోయాడు. ఆమె రెండు చేతులతో యోసేపును బంధించి తన మీదకు సమానంగా లాక్కుంటుంటే తన క్రిందవున్న తన యజ మానురాలి శరీరం మీద ఏమాత్రం బరువు పడకుండా లేక, నొప్పి తగలకుండా ఎట్లా క్రిందకు దిగాలా? అని సున్నితంగా ఆమెని వారిస్తుంటే, ఆమె ఈ సున్నితమైన ప్రతిఘటనను ఆహ్వానంగా భావించి, తన ముఖం మీదకు యోసేపు యొక్క ముఖమును గట్టిగా అదిమి పట్టుకొన్న ప్పుడు, యోసేపు తల మీద కట్టిన గుడ్డ ఊడిపోయినది. అతని అందమైన తల వెంట్రుకలు, ఉంగరాలు తిరిగి ఉన్నాయి. ఆమె చూచింది. "అబ్బ! ఇప్పుడు ఇంకా అందంగా ఉన్నావు" అని యోసేపును నడుము మీద పట్టుకోబోయి నప్పుడు యోసేపు మంచం మీదనుండి క్రిందకు జారాడు.

"నా యజమానుడు తనకు కలిగినదంతయు నా చేతికి అప్పగించాడు కదా!" అంటుంటే ఆమె లేచి దగ్గరకి వచ్చి, యోసేపును గట్టిగా కౌగిలించుకుంది. యోసేపు వారించ లేదు. "ఈ ఇంటిలో, నాకంటే పైవాడు ఎవడును లేడు... దయచేసి నేను చెప్పేది వినండి" అన్నాడు విసుకుగా. ఆమె ఇవేమి వినటంలేదు అని తెలుస్తుంది.

"నీవు అతని భార్యవైనందున నిన్ను తప్ప సమస్త మును..." అంటుంటే, ఆమె అతని నోటి మీద కుడిచేయి వేసి, మాట్లాడనివ్వకుండా ఎడమచేతితో యోసేపు నడుము మీద చెయ్యివేసి లాగుతుంటే, యోసేపులో సహనం నశించి పోయింది. ఈ ప్రపంచమంతా తనని చూసి నవ్వినట్లుగా,

తన దేవుని ఎగతాళి చేస్తున్నట్లుగా అనిపించింది. దాంతో పట్టరాని కోపం, దుఃఖం వచ్చేశాయి. “నేనెట్లు ఇంత ఘోర మైన దుష్కార్యము చేసి, దేవునికి విరోధముగా పాపమును కట్టుకొందును?” అంటూ ఆమెని కొంచెం ప్రక్కకు నెడు తుంటే, ఆమె మంచం మీద పడివున్న అతని పై వస్త్రమును గట్టిగా పట్టుకొని, కుడిచేతితో యోసేపు నడుము మీద గుంద్రముగా పట్టుకొని “యోసేపు, నాతో శయనించు...రా!” అంటూ, దీనంగా బ్రతిమాలింది.

ఆమె కళ్ళలోకి చూసిన యోసేపుకు, తనకు తెలియ కుండానే తన కళ్ళు చెమర్చినాయి. దీనంగా ఉన్న ఆమె ముఖము, కళ్ళు చూసినప్పుడు బలం, ధైర్యం తనలోనికి ప్రవేశించినట్లు అనిపించింది. ఒక చేతితో ఆమెను నెడుతూ, మరో చేతితో ఆమె చేతిలోని తన పై వస్త్రమును తీసికోవాలని చూచాడు. తన పై వస్త్రము కొరకు తాలిమి చేస్తే, అంగీ కూడా ఆమె చేతిలో చిరిగి పోవచ్చును అనుకొని, తన పై వస్త్రమును ఆమె చేతిలో విడిచిపెట్టి, తప్పించుకొని బయటకు పరుగెడుతుంటే, యజమానురాలు “మెముకాన్” అని పెద్దగా పిలవడం వినిపించింది.

బయటకు వచ్చిన యోసేపుకు తను ఎటు వెళ్తున్నాడో తనకే తెలియదు. తనకి తెలియకుండానే నడుస్తూ వెళ్తున్నాడు. తల మీద గుడ్డలేదు. ఇప్పుడు యోసేపును చూచిన వారెవ్వరు అతను యోసేపు అని అనుకోవటం లేదు. ఎందుకంటే హెబ్రీయుడైన యోసేపు తల మీద వస్త్రము లేకుండా ఐగుప్తీయులు చూసింది ఇదే మొదటిసారి. యోసేపుకు కూడా తన తల మీద వస్త్రము లేదన్న ఆలోచన లేదు. ఎంతసేపు నడిచాడో, నైలునది అడ్డం వచ్చినప్పుడు ఆగిపోయాడు.

తను ఇప్పుడు ఎక్కడ ఉన్నాడు? ఓను యాజకుని ఇంటి ప్రాంగణం దగ్గర. తను ఇక్కడికి ఎలా వచ్చాడు? నీళ్ళలో చూశాడు. తన ముఖమేనా? అనుకున్నాడు. మనస్సులో ఆమె రూపం మెదలింది. తను ఈ విషయం ఎవరికీ చెప్పకూడదు. ఆమె పెద్దగా అరచిన అరుపు ఇంకా తన చెవుల్లో మ్రోగుతుంది. మెముకాన్ అని ఎందుకు అరిచింది? తను ఆమెకి ఏ విధంగాను హాని చెయ్యలేదు. ఇప్పుడు తను ఏమి చెయ్యాలి? మరలా తన యాజమాని వద్దకు వెళ్ళాలా? తన యజమానురాలికి తను లోబడ నందున పగ పెంచుకుంటుందా? ‘ఛ... అంత సుకుమారి, అంత అందమైన ఆమె అట్లా చెయ్యదు’ అనుకున్నాడు.

నైలునదికి పెద్దగట్టు లేదు చిన్నగట్టే. లోతు ఇక్కడ ఎక్కువే ఉంటుందేమో! ఒకవేళ ఇప్పుడు తను ఈ నీళ్ళలోపడి చచ్చిపోతే ఒక్క నిమిషంలోనే ఈ జీవితానికి విముక్తి. ఈ మంచి చెడ్డలకు ముగింపు. అందరు నడిచేదారికాదు తనది. ఇది తన ఊరు కాదు. తనదేశం కాదు. వీరు తన ప్రజలు కారు. తన దేవుడు లేని దేశం. ఒక్కొక్క దేశానికి ఒక్కొక్క దేవుడా? ఇక్కడ సూర్యుడు, కనానులో, హెబ్రోనులో ఉన్న సూర్యుడు ఇక్కడ లేడా? అయితే హెబ్రోనులో సూర్యుణ్ణి పూజించరే? ఈ దేవుళ్ళ సృష్టిలో మనిషి తనను సృజించిన వాడిని కనుక్కొనలేక పోతున్నాడు. ఎదురుగా సూర్య దేవుని ఆలయం. సూర్యుడు రోజు కనబడుతుంటే కనబడుతున్న సూర్యున్ని బొమ్మరూపంలో బంధించి, గదిలోపెట్టి పూజిం చుట ఎందుకు? ఏమో..! యాజకునికి ఎంత ఆదాయం. దేవుని పేరు మీద ఎంత ఆర్జన.

తన దేవుడు ‘బేతేలు దేవుడు’. ఆ రోజు తను ఒంటరిగా ప్రయాణం చేస్తుంటే, మాట్లాడిన దేవుడు. ఇప్పుడు మాట్లాడడెందుకు? ఒంటరిగా అడివిలోనే మాట్లాడతాడా? అయితే మా తాత అబ్రాహాముతో పట్టణంలో ఉన్నప్పుడే మాట్లాడాడుగా! కాదు. పట్టణంలో నుండి బయట తిరిగే టప్పుడు మాట్లాడి ఉంటాడు. మరి తను ఈ పట్టణానికి దూరంగా నది దగ్గర ఉంటే పలకరించడెందుకని? నా ప్రార్థనలో పొరపాట్లు ఉన్నాయా? నా నమ్మిక, విశ్వాసంలో నిశ్చయత లేదా? నాలో బలహీనతల్ని నాకు చూపించి, దిద్దుకోమంటే దేవునిని ఎదిరించానా?

అన్నీ ప్రశ్నలే! సమాధానం ఎవరిస్తారు? మరలా బేతేలు పోవాలా? దేవుడు ఏక ప్రాంతవాసిగా ఉన్నాడా? ఈ సృష్టింతా ఒక్కడే చెయ్యలేదా? అబ్బ, తల తిరిగిపోతుంది. అందరు తన లాగనే రకరకాల జీవితాలు జీవిస్తున్నారా? ‘ప్రభూ! అందరిలానే నన్ను బ్రతకనియ్యమని ఎన్నిసార్లు ప్రార్థన చేశాను. బానిస బ్రతుకైనా సంతోషం కలిగి, ప్రేమ

కలిగిన మనుష్యుల మధ్య నన్ను ఉంచావే. ప్రభువా! ఇంతకంటే ఎక్కువ వద్దు. తక్కువ వద్దు అని బ్రతిమాలానే. ఈ రోజు జీవితం మీద విసుకు కలిగించావే. అంత అంద మైన స్త్రీమూర్తి వలన ఒక అందమైన జీవితం అంధకారం చేస్తావా? నన్ను తీసికెళ్ళరాదా! ఆత్మహత్య అపరాధం నుండి నన్ను విడిపించరాదా? నిమిష నిమిషం ఈ సృష్టిలో ఎవరో ఒకరు నీ దగ్గరకు చేరుకుంటున్నారు కదా! నన్ను ఒక్కడని తీసుకొని వెళ్ళి ఈ క్షోభ నుండి తప్పించవా?' అట్లాగే నేలమీద నడుం వంచాలి అనుకున్నాడు.

తన మీదుగా తన నీడ ఎలా ముందుకు వస్తుంది. కాదు. 'నా వెనుక ఎవరు?' వెనక్కి తిరిగి చూచాడు. 'నిజమేనా..! ఇదేమిటి ఆసెనా..! ఇలా ఎందుకు వచ్చావు? తల అట్లా చెదరి ఉందేమిటి? ముందు చూసిన రూపం ఏమయ్యింది. ఎందుకు? తన బ్రతుకు ఇలా తయార యింది? సరే! తల్లి చాటుబిడ్డ. ఆ పిల్లకు ఏమయింది?'

"ఆసెనా..! ఏమైంది? నీకేమైంది?" అని అడిగాడు యోసేపు.

ఆసెనతు ఏమి మాట్లాడలేదు. ప్రక్కన కూలబడింది. కూలబడినప్పుడు ఈ భూమి బరువుకంటే ఆమె హృదయ బరువు ఎక్కువైనట్లుగా కూలబడింది.

"నాకేమైంది అని నన్ను ఓదార్చుతున్నారా?" అని చిన్నగా అనగలిగింది. "మీకేమైందో మీకు తెలియదా? మీకేమైనా పర్వాలేదు కాని ఇతరులకు ఏమి కాకూడదని అనుకుంటున్నారా?" అని అంది. అలా అంటున్నప్పుడు ఆమె కంఠం వణికింది.

ఇంత చిన్నపిల్లలో ఇంత పెద్ద వేదనా? ఏమైంది. "ఆసెనత్! ఏమైంది? అమ్మ, నాన్నా కులాసాయేనా?" అని అడిగాడు.

ఆసెనతు కళ్ళలో నీళ్ళు, "అరె!.. ఎందుకు ఏడుస్తు న్నావ్?" అని అన్నాడు. తన గొంతులోని వేదనను చూసి తనకే ఆశ్చర్యం వేసింది. ఈ అమ్మాయి ఎవరు? ఈమె మీద తనకెందుకు ఈ జాలి. ఒక్కరోజు పరిచయం. కనీసం మాటకూడలేదు. ఏదో ఆత్మీయత. ఆత్మీయత భావనకి ఎంత బలమైన బంధం వుంది! ఛ..! ఏమిటి ఈ బిడ్డ బాధ? అనుకుంటూ ఆసెనతును చూసాడు.

"మీకు తెలియదా?" అని అడిగింది.

"నాకెలా తెలుస్తుంది నీ సంగతి?" అని అన్నాడు.

"నా సంగతి కాదండి... మీ సంగతి" అని అంది.

"నా సంగతా! ఏమిటి నువ్వు మాట్లాడేది?" అడిగాడు యోసేపు.

"ఒక గంటయినా కాలేదు కదా..!" మనసులోని మాట పైకి అన్నాడు.

"మీరు వ్యాకులతలో ఉన్నారు. మీకు సమయం తెలియదు. ఇప్పుడు సమయం సాయంకాలం ఐదు. ఆ సంఘటన జరిగి రెండు జాములు పూర్తయింది. ఆ సంగతి రాజప్రాంగణానికి కూడా పాకిపోయింది. రాణువ వారు మా ఇంటికి కూడా వచ్చారు" అని చెప్పింది.

"ఎందుకు?" అడిగాడు యోసేపు.

"మీ కొరకు" అన్నది.

"నా... కొరకా!" అన్నాడు ఆతృతగా. **(సశేషం)**


**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా**
**చందా పంపించాలంటే**
**ఈ క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra

# నా చిత్తానుసారుడు

(దావీదు జీవిత చరిత్ర)

- కొడవటికంటి

“అతడు దిగి వచ్చును” అని వినిపించింది.

“కెయీలా జనులు నన్ను నా జనులను సౌలు చేతికి అప్పగించుదురా” అని అన్నాడు.

“వారు నిన్ను అప్పగించుదురు” అని వినిపించింది.

వెంటనే దావీదు ఆ నాయకులతో “మనమందరం కలసి బయలుదేరవద్దు. మొదట ఏలియాబు అన్న, ఒక గంట ఆగి తర్వాత మిగిలిన వాళ్ళు, తర్వాత ఇప్పుడు అందరికి కత్తులు డాళ్ళు ఉన్నవి. దోపు సొమ్మయిన పశువులను అన్నింటిని నలుగురికి అప్పగించి పశువుల కాపరులవలె బయలుదేర వలసి వుంది. ఎవరి గుంపు ఆ నాయకుడు ఎక్కడికి పోగలరో అక్కడకు వెళ్ళండి. కాని అందరు జీపు అరణ్యములో పెద్ద కొండ దగ్గర రేపు సాయంకాలానికి కలుసుకుందాం” అని ముగించాడు.

జీపు అరణ్యము కొండలమయమై, చక్కని సెలయేరులు ఎన్నో ప్రవహిస్తున్నాయి. కొంతమంది తన అనుచరులను కొండ స్థలములలోను, కొంతమందిని జీపు అరణ్యంలోనున్న పర్వతం మీదను ఉంచి తాను ప్రతిదినము గుఱ్ఱం మీద అన్ని కేంద్రాలను పరీక్షిస్తూ తన వారిని పరామర్శిస్తుండే వాడు.

జీపు అరణ్యంలో నివశించే వారిని జీఫీయులు అని పిలుస్తారు. వీరికి అక్కడ ఒక గ్రామం ఉంది. వీరు యూదులై నప్పటికిని మిగిలిన గోత్రికులతో కాని బయటి ప్రపంచంతో కాని ఎక్కువ సంబంధ భాందవ్యాలు కలిగి యుండలేదు. ఉత్తరాన పురాతనమైన పట్టణమైన హెబ్రోను, జీపునకు ఆరుమైళ్ళు మాత్రమే. ప్రశాంత వాతావరణంలో జీవిస్తున్న జీఫీయులకు దావీదు దండు రాకతో చాలా ఇబ్బందులు ఎదుర్కొనవలసి వచ్చింది. అయినప్పటికి వారు దావీదు యొక్క చరిత్ర తెలిసిన వారైనందున తలయొగ్గి ఉన్నారు.

ఒక మధ్యాహ్న సమయాన తన సైనికులందరిని సమకూర్చి వారికి అనేకమైన యుద్ధ సమాచారములను చెబుతూ వారి ఇబ్బందులు వింటున్న సమయంలో తన సైనికులలో ఇద్దరి మధ్య నడుస్తూ వస్తున్న తన ప్రాణ స్నేహితుడు యోనాతానును చూచాడు. ఆ సభలోనే తన ప్రక్కన ఒక ఆసనం వేయించాడు. యోనాతాను కూర్చున్న తర్వాత యోగక్షేమాలు విచారించి కెయీలా యుద్ధము సంగతి అక్కడ తాను పొందిన విజయము గురించి చెప్పాడు.

అప్పుడు యోనాతాను లేచి సభికులందరూ “వింటుండ గానే నా తండ్రి నిన్ను పట్టుకొనజాలడు. నీవు భయపడవద్దు. నీవు ఇశ్రాయేలీయులకు రాజువగుదువు. నేను నీకు సహ కారినగుదును. ఇది నా తండ్రియైన సౌలుకు తెలిసే యున్నది. కెయీలా యుద్ధంలో నీతోమాటలాడిన దేవుడు నిన్ను ఎన్నడును ఎడబాయడు. ఆరువందలమంది మనుష్యు లను నీ దగ్గరకు పంపిన దేవుడు వీరందరికి అన్నవస్త్రము లను సమకూర్చును” అని అక్కడ ఉన్న దావీదు సహచరు లందరితో “నా మిత్రుడు దావీదు ఇశ్రాయేలీయులకు తప్పక ఏలిక అవుతాడు. అంతవరకు మీరు నిరీక్షణ విడువవద్దు. ఆయన రాజైన తరువాత మీరందరూ సైన్యంలో శతాధి పతులుగాను, సహస్రాధిపతులుగాను అవుతారు” అని చెప్పిన తరువాత దావీదు యోనాతాను ఒకరినొకరు కౌగిలించుకొని యెహోవా నామమున నిబంధన చేసుకున్నారు.

యోనాతాను తన ఇంటికి వెళ్ళిన తరువాత దావీదు సహచరులలో కొత్త ఉత్తేజం వచ్చింది. ఎవరైతే తమ నాయ కుని ప్రాణం తీయజూచుచున్నాడో అతని జ్యేష్ఠ కుమారుడు తమ నాయకుని ప్రాణస్నేహితుడవటం ఎవరూ ఊహించని ఓదార్పు.

యోనాతాను వెళ్ళిపోయిన తర్వాత ఆ రోజంతా దావీదు ఒంటరిగా అరణ్యంలో గడిపాడు. సితారా చేతపట్టుకొని వాయిస్తూ ధ్యానంలో గడిపాడు. దేవునికి స్తోత్రం చెల్లించటం లోనే తన హృదయంలోని మీకాలు విషయమైన వ్యధ దూర మవుతున్నది. యోనాతాను యొక్క ఎడబాటు సహించ గలుగుతున్నాడు. ఇంతమంది తన మీద ఆధారపడి యున్నా రన్న భారం పోయి విశ్వాసం పెరుగుతున్నది.

యెహోవా సత్యదేవా నన్ను విమోచించిన వాడవు నీవే.

నేను యెహోవాను నమ్ముకొనియున్నాను.

నీవు నా బాధను దృష్టించియున్నావు.

నా ప్రాణబాధలను నీవు కనిపెట్టియున్నావు.

కావున నీ కృపను బట్టి నేను ఆనందభరితుడనై సంతోషించెదను అని పాడుతూ సితారా వాయిస్తూ ఉంటే అబీషై వచ్చి ప్రక్కన కూర్చున్నాడు. కొంతసేపటికి సితారా ధ్వని ఆగింది. దావీదు ధ్యానంలో నుండి కళ్ళు తెరచి అబీషైని చూచి "ఎంతసేపైంది వచ్చి" అన్నాడు.

"కొంచెంసేపు మాత్రమే" అన్నాడు అబీషై.

సంగతి ఏమిటి అన్నట్లు చూచాడు.

"జీఫీయులలో కొందరు ఈ ఉదయం గిబియాలో నున్న సౌలు వద్దకు వెళ్ళారు" అన్నాడు అబీషై.

"ఎవరు చెప్పారు?" అడిగాడు దావీదు.

"యెజ్రెయేలీయుడైన యెజెరు" అన్నాడు.

"అయితే అది యధార్థమే. అతను ఈ ప్రాంతము వాడే కదా! అతనిని పిలుచుకొనిరా" అన్నాడు దావీదు.

అబీషై లేచి నిలబడి వెనక్కు తిరిగి చప్పట్లు కొట్టాడు. యెజెరు వచ్చి దావీదుకు నమస్కరించాడు. అతనికి దాదాపు యాభై అయిదు సంవత్సరాలు ఉంటాయి.

"నీకెలా తెలుసు?" అని అడిగాడు దావీదు.

"అహీనోయము" అన్నాడు.

"ఆమె సౌలు భార్య కదా" అన్నాడు దావీదు.

"కాదు, నా కుమార్తె, ఇక్కడికి దగ్గరలోనే మావూరు" అన్నాడు యెజెరు.

దావీదు లేచి నిలబడి "ఇప్పుడు మీరు ఏమి సలహా ఇస్తారు" అన్నాడు.

"ఇక మనము ఇక్కడ ఉండటం మంచిదికాదు" అని తన చెయ్యి నైబుతి దిక్కుగా చూపిస్తూ "అక్కడ మాయోను అరణ్యం క్షేమకరం, జీఫీయులకు అది తెలియదు" అన్నాడు.

దావీదు యెజెరు దగ్గరకు వచ్చి "మీరు, అబీషై గుఱ్ఱముల మీద వెళ్ళి అక్కడ అనువైన ప్రదేశము చూచి రండి. ఈ లోపల మనవారందరూ ప్రయాణమవుతారు" అని ఆగి "అహీనోయము భర్త మనతో ఉన్నాడా?" అని అడిగాడు.

"లేదు, ఆమె కన్య" అని అన్నాడు యెజెరు.

దావీదు తన నివాసం వైపు నడిచాడు.

ఇప్పుడు సౌలు సేదతీర్చటానికి దావీదువలె సంగీత వాయిద్యములు వాయించే వారెవరూ గిబియాలో లేరు. ఎప్పుడూ కలత చెంది అసహనంగా అతి కోపిష్టిగా మారాడు.

దావీదును గూర్చిన వర్తమానముతో జీఫీయులు వచ్చి వున్నారని అబ్నేరు చెప్పాడు. వెంటనే సౌలు తన సభామందిరమునకు వచ్చాడు.

పదిమంది జీఫీయులు వచ్చి నమస్కారము చేశారు. మాట్లాడమని సౌలు సైగచేసాడు.

వారిలో ఎత్తైన వ్యక్తి ముందుకు వచ్చి "రాజా నీ మనోభిష్టమంతటి చొప్పున దిగిరమ్ము. రాజవైన నీ చేతికి అతనిని అప్పగించుట మా పని" అని అన్నాడు.


"మీరు పోయి అతడుండు స్థలమేదైనది, అతని చూచిన వాడెవడైనది నిశ్చయంగా తెలుసుకొనును. అతడు బహు యుక్తిగా ప్రవర్తించుచున్నాడని నాకు వినబడెను. గనుక మీరు బహు జాగ్రత్తగా నుండి అతడుండు మరుగు తావులను కనిపెట్టియున్న సంగతంతా నాకు తెలియజేయుటకై మరల నా యొద్దకు తప్పకరండి. అప్పుడు నేను మీతో కూడా వత్తును. అతడు దేశంలో ఎక్కడ ఉండినను యూదా వారం దరిలో నేను అతని వెదకి పట్టుకొందును" అన్నాడు సౌలు.

జీఫీయులు ఒకరి ముఖం ఒకరు చూచుకొని బయటకు నడిచారు. అబ్నేరు వారిని వెంబడించాడు.

కొంతదూరం వెళ్ళిన తర్వాత సౌలుతో మాట్లాడిన అతను అబ్నేరును చూచి "దావీదును, అతని జనులును ఎక్కడ దాగి ఉన్నది మేము చూచి రాజునకు తెలియచెప్తే రాజు వెంటనే బయలుదేరి రావటమో లేక తమరు సైన్యాధిపతులు కదా మిమ్ములనైనా సైన్యంతో పంపించవచ్చు కదా! మేము ఇంత దూరం రాజు క్షేమం కోరి రావడం వృథా అయినది" అన్నాడు.

"రాజు మనఃస్థితి సరిగా లేదు. అందువలన ఈ ఇబ్బంది. మీరు బయలుదేరి వెళ్ళండి. మరలా రానవసరం లేదు. నేను రాజును తీసికొని రేపు బయలుదేరుతాను" అన్నాడు అబ్నేరు.

**(సశేషం)**



# 'డౌన్ టు ఎర్త్'



డబ్బు, అధికారం, టాలెంట్స్ ఉండి సౌమ్యంగా, మృదు స్వభావంతో, తగ్గించుకొనే గుణం ఉండే వారిని 'డౌన్ టు ఎర్త్' అంటారు, అంటే తనకున్న ఆధిక్యతలనుబట్టి గర్వము, అహంకారము లేకుండా ఉండేవారు అని. బైబిలు భాషలో చెప్పాలంటే 'తనను తాను తగ్గించుకోవడం' అని అనొచ్చు. నిజానికి దేవుడు కోరుకొనే డౌన్ టు ఎర్త్ నేటి ప్రపంచంలో ఎవరిలోను కనబడదు. తగ్గించుకొని జీవించడ మంటే చచ్చిన శవంతో సమానం అనుకుంటారు, ఒక రకంగా అది కూడా నిజమే కావొచ్చు. మనం షాపింగ్‌కి వెళ్ళినప్పుడో, రెస్టారెంట్‌కి వెళ్ళినప్పుడో అక్కడ మనకి చాలా మర్యాదలు జరుగుతుంటాయి. చిరునవ్వుతో మనల్ని సాదరంగా లోపలికి ఆహ్వానించి, కుర్చీవేసి, టీనో, కూల్‌డ్రింకో తెప్పిస్తారు, చాలా చక్కగా మాట్లాడతారు, మనం ఏమైనా విసుక్కున్నా, గొంతు పెద్దది చేసి మాట్లాడినా వాళ్ళు మారు మాట్లడరు. ఇదంతా వ్యాపారంలో భాగంగా కస్టమర్లతో వ్యవహరించే విధానమే తప్ప వారి స్వభావం కాదు. అలాగే రాజకీయ నాయకులు మన వీధిలోకి వచ్చినప్పుడు ప్రతి ఒక్కరినీ చిరునవ్వుతో పలకరిస్తారు, షేక్‌హ్యాండ్ ఇస్తారు, ఒక్కోసారి చాలా పేదవారి ఇంట్లోకి వెళ్ళి భోజనం కూడా చేస్తారు. ఇది వారి రాజకీయ జీవితంలో ఒక భాగమే తప్ప తగ్గించుకోవడం కాదు. వారి అవసరానికి తగ్గట్టు వారు నడచుకొనే విధానమే తప్ప వాళ్ళకి 'డౌన్ టు ఎర్త్' అనే పదానికి అర్థమే తెలియదు. తగ్గించుకోవడమనేది తాత్కాలిక మైనది, అవసరసంబంధమైనదిగా కాక, మన స్వభావ సంబంధమైనది ఉండాలి. అది పుట్టుకతో వచ్చేది కాదు. మనకి మనం అలవరచుకోవాల్సినది. అసలు తగ్గించుకొని ఎందుకు జీవించాలి? తగ్గించుకొని జీవించాల్సినంత అవసరం ఎవరికైనా ఏముంటుంది? తగ్గించుకొని జీవించాల్సిన అవసరం ఎవరికీ ఉండదు కానీ, దేవుడు చెప్పాడు కాబట్టి మనల్ని మనం తగ్గించుకోవాలి. దేవుడు ఏం చెప్పినా అది మన మంచి కోసమే చెప్తాడు. మనం తగ్గించుకొని జీవించినా, హెచ్చించుకొని జీవించినా దేవునికి ఎలాంటి లాభము ఉండదు. హెచ్చించుకోవడం వలన చాలా అనర్థాలు జరుగుతాయి. ఇంతకీ ఎవరు తగ్గించుకొని ఉండాలి? ఎవరు హెచ్చించుకోకూడదు? అనేది మనకి తెలియాలి కదా! తక్కువ స్థాయిలో ఉన్నవాళ్ళు తమ్మును తాము హెచ్చించుకోకూడదు, ఎక్కువ స్థాయిలో ఉన్న వాళ్ళు తమ్మును తాము తగ్గించుకోవాలి. 'తన్ను తాను హెచ్చించుకొనువాడు తగ్గింపబడును; తన్ను తాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడును' (మత్తయి 23:12). తగ్గింపబడును, హెచ్చింపబడును అంటే తక్కువ స్థాయిలో ఉన్న వాళ్ళు తమ్మును తాము హెచ్చించుకోకుండా ఉంటే దేవునిచే హెచ్చింపబడతారు. ఎక్కువ స్థాయిలో ఉన్నవాళ్ళు తమ్మును తాము తగ్గించుకోకపోతే దేవునిచే తగ్గింపబడతారు. ఎవరైనా మనకు నచ్చని పని చేసినా, అవసరంగా కానీ, అనవసరంగా కానీ మనల్ని ఒక మాట అన్నా, రెచ్చగొట్టేలా ప్రవర్తించినా దానిని ఓర్చుకోవడం చాలా కష్టమౌతుంది. ఏదో ఒకటి చెయ్యాలనిపిస్తుంది. ఓర్చుకోవడం అనేది మనకు పుట్టుకతో రాదు. దానిని అలవాటు చేసుకోవాలి, అది మన దినచర్యలో ఒక భాగమైనప్పుడే మనకు అలవాటు అవుతుంది. అలా అలవాటు చేసుకునే క్రమంలో తగ్గించుకొనే గుణము దానంతట అదే వస్తుంది. అంతేగానీ మన అవసరాలకో, వ్యాపారంలో, ఉద్యోగంలో భాగంగా **'డౌన్ టు ఎర్త్'** ఫేస్ పెట్టుకున్నంత మాత్రాన అది తగ్గించుకున్నట్లు కాదు. ఈరోజు నుండి తగ్గించుకొనే గుణము అలవాటు చేసుకోవాలనుకొనే వారికి ఆల్ ది బెస్ట్.

**ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు**

**9 4 4 0 2 1 7 7 2 6**

# ఆత్మీయ సిద్ధపాటు

ప్రియమైన విశ్వాసులందరికీ ప్రభువు నామమున శుభములు, మన జీవితంలో ఎన్నో పోరాటాలు ఉంటాయి. వాటిలో విజయం కావాలంటే ఆత్మలో సిద్ధపాటు ఎంతో అవసరం. "యాజకులు బూరలూదగా ప్రజలు కేకలు వేసిరి బూరల ధ్వని వినినప్పుడు ప్రజలు ఆర్భాటముగా కేకలు వేయగా ప్రాకారము కూలెను. ప్రజలందరు తమ ఎదుటికి చక్కగా పట్టణ ప్రాకారం యెక్కి పట్టణమును పట్టుకొనిరి" (యెహోషువ 6:20). ఇశ్రాయేలీయులు యెరికో పట్టణమును స్వాధీనం చేసుకోవడం అంత సులభమైంది కాదు. ఆ విజయం వెనుక ఎంతో గొప్ప సిద్ధపాటు ఉంది. వారు యొర్దాను నది దాటిన వెంటనే అమోరీయుల కనానీయుల మీదికి యుద్ధమునకు పోలేదు కానీ పది రోజులు గిల్గాలు అనే ప్రాంతంలో వేచి ఉన్నారు. యెరికో పట్టణం మీద విజయానికి కావలసిన సిద్ధపాటు ఇక్కడే జరిగింది. యెహోషువ ఐగుప్తులో నుండి బయలుదేరిన ఇశ్రాయేలీయులందరికి ప్రతిగా, వారికి పుట్టిన కుమారులకు రాతి కత్తులతో సున్నతి చేయించాడు. సున్నతి అనేది ఇశ్రాయేలీయులతో దేవుడు చేసిన నిబంధనకు గుర్తు. కాబట్టి నూతన తరం ఇశ్రాయేలీయులు సున్నతి ద్వారా వారి నిబంధనను మళ్లీ పునర్నిర్మాణం చేసుకున్నారు. కాబట్టి క్రైస్తవులు విజయవంతమైన, శక్తివంతమైన జీవితం కావాలి అంటే, మన హృదయమునకు కూడ సున్నతి చేయాలి. "మీరు సున్నతి లేని మీ హృదయమునకు సున్నతి చేసికొని ఇక మీదట ముష్కరులు కాకుండుడి. (ద్వితీయో. 10:16) దేవుని వాక్యము ద్వారా మన హృదయం కూడా, నూతన హృదయంగా మారుతుంది.

రెండవదిగా ఇశ్రాయేలీయులు గిల్గాలులో దిగి ఆ నెల 14వ తేదీని సాయంకాలమున యెరికో మైదానములో పస్కా పండుగను ఆచరించిరి (యెహోషువ 5:10). "క్రీస్తు అను మన పస్కా పశువు వధింపబడెను గనుక పాతదైన పులిపిండితోనైనను దుర్మార్గతయు దుష్టత్వమునను పులిపిండితోనైనను కాకుండా విష్కాపట్యమును సత్యమునను పులి యని రొట్టెతో పండుగ ఆచరించవలెను (1కొరింథీ. 5:7-8).

మూడవదిగా యెహోషువ యెరికో ప్రాంతమున ఉన్నప్పుడు ఆయన కన్నులెత్తి చూడగా దూసిన కత్తి చేత పట్టుకుని ఉన్న యెహోవా సేనాధిపతి "చూడుము నేను యెరికోను దాని రాజును పరాక్రమముగల శూరులను నీ చేతికి అప్పగించుచున్నాను" (యెహోషువ 6:2) అని దేవుని మాటను తెలియజేసెను.

ప్రియమైన సోదరి సోదరులారా, క్రీస్తునందు "ఇప్పుడు మరి ఎక్కువయైన వాగ్దానములనుబట్టి నియమింపబడిన మరి ఎక్కువైన నిబంధనకు మధ్యవర్తియై ఉన్నాడు గనుక మరి శ్రేష్ఠమైన సేవకత్వము పొంది ఉన్నాడు" (హెబ్రీ. 8:6). ఆయన చేయబోవు నిబంధన ఏదనగా వారి మనసులో నా ధర్మ విధులను ఉంచెదను, వారి హృదయముల మీద వాటిని వ్రాయుదును, నేను వారికి దేవుడనై యుందును. వారు నాకు ప్రజలై ఉందురు... వారిలో చిన్నలు మొదలుకొని పెద్దల వరకు అందరును యేసును తెలుసుకొందురు (హెబ్రీ. 8:10,11) అదే హృదయ సున్నతి. క్రీస్తు అనే పస్కాను అనుదినం మనము భుజించాలి. క్రీస్తు నోట నుండి వచ్చే ప్రతి మాటను మన హృదయంలో పదిలపరుచుకోవాలి. అటు తర్వాతే గొప్ప విజయం మనకు కలుగుతుంది ఇటువంటి ఆత్మీయ సిద్ధపాటు దేవుడు మీకును, నాకును అనుగ్రహించును గాక! ఆమేన్.

**బైబిల్ క్విజ్-04 జవాబులు పంపినవారు :**

1. బి. సువార్తరాజు-బెంగుళూరు, 2. కె. లలిత -కావలి, 3. శాంతకుమారి-చెన్నై, 4. రాజ్‌కుమార్- హైదరాబాద్, 5. యం. రాధ-విజయవాడ, 6. కె. సుమలత-గుంటూరు, 7. టి. ఎస్తేరు-నిడదవోలు, 8. నిరీక్షణ-నెల్లూరు, 9. లలిత-గుంటూరు, 10. కమలమ్మ-రాజమండ్రి, 11. వెంకట్-నంద్యాల, 12. ప్రకాష్-అనంతపురం.

# మధ్యకాలము

మెనిలాస్ ఈ విధంగా అన్యాయపు పద్ధతిలో యాజకత్వం సంపాదించి ప్రతి సంవత్సరం అదనపు పన్ను కట్టుటకు నిశ్చయించుకొనెను. అతను అనేక బంగారు పాత్రలను దేవాలయం నుండి దొంగిలించి వాటిని ద్రవ్యంగా మార్చి రాజునకు చెల్లించెను. అంతియొకయ గవర్నరైన ఆంద్రో నికస్‌కు లంచమిచ్చిన తన అన్న అయిన ఒనియాస్ ఏదైనా ఒకరోజు తనకు అడ్డువచ్చునన్న అనుమానంతో చంపిం చెను. ఇది సత్యము. ప్రజలు ఆంద్రోనికస్‌ను ముట్టడివేసి అతడు జరిగించిన దుర్మార్గపు పనులకు, హత్యకు అతడిని శిరచ్ఛేదనము చేసిరి. మరియు లిసిమాకస్ యెరూషలేము యొక్క అల్లరిప్రజలచే చంపబడెను. అయినప్పటికీ మెనీలాస్ తనను రక్షించుకొనుటకు, యెరూషలేము నుండి సన్‌హెద్రిన్ సభయొక్క ముగ్గురు విచారణ సభ్యులు అతనిని విచారణ చేయుటకు వచ్చియుండగా లంచమిచ్చి వారిని కూడా శిరచ్ఛేదనము గావించెను.

అంతియొకస్ ఐగుప్తు యుద్ధంలో నిమగ్నమై యున్నప్పుడు మెనీలాస్ చనిపోయెననెడి అబద్ధపు వార్తను పుట్టించి వెయ్యి మంది పురుషులతో నడచుకుంటూ వెళ్ళి యెరూషలేము పట్టణమును ఆశ్చర్యపరచి మెనీలాస్‌ను కోటలో వేసి బంధించి కత్తిచేత చంపెను. మరియు తనకు వ్యతిరేకముగా ఉన్న వారినందరిని చంపెను.

ఈ వార్త అంతియొకయ అంతట వెంటనే వ్యాపించెను. కాని అతడు యూదుల యొక్క విధేయతనుబట్టి వారిని చంపకుండునట్లు త్వరపడెను. మార్గమధ్యంలో యెరూష లేము వాసులు అతని మరణవార్తను విని గొప్ప సంతోషంతో యుండిరని అతనికి మార్గములో తెలుపబడెను. కనుక అతడు ఎంతో రౌద్రుడై క్రీ॥పూ॥ 170లో తుఫానువలె నలభైవేలమంది యూదులను చంపి ఎక్కువమంది ప్రజలను పొరుగుదేశములకు బానిసలుగా అమ్మెను. అతడు అతి పరిశుద్ధ స్థలమున ప్రవేశించి బలిపీఠము మీద ఆడుపందిని బల్యర్పణ చేసి ఆ రక్తమంతటిని ఆలయమంతట చిలక రించెను. అతడు 800 మణుగుల బంగారమునకు సమాన మగు వస్తువులను, బంగారమును కొల్లపెట్టెను. అంతియొ కయకు తిరిగి వచ్చిన తర్వాత ఫిలిప్పు అను క్రూరుడైన కసాయి వ్యక్తిని యూదయ దేశపు గవర్నరుగా చేసెను. ఆంద్రోనికస్ అను చెడ్డవ్యక్తి సమరయదేశపు గవర్నరుగా ఉండి అందరికంటే చెడిపోయిన రెండవ మెనీలాస్‌ను యాజకత్వంలో ఉంచెను. అతని అరాచకత్వనకు, అవి చాలవన్నట్లు అతని సైన్యాధిపతియైన అపొల్లోనియస్ ఆధిపత్యంలో ఇరవై రెండువేల సైనికులను యెరూషలేము నందలి పురుషులందరిని కత్తిచేత చంపబడునట్లు స్త్రీలను పిల్లలను బానిసలుగా చేసి సబ్బాతు దినమందు తీవ్రముగా వధించిరి. చాలామంది త్వరపడి తప్పించుకొని కొండల లోనికి, గుహలలోనికి పారిపోయిరి.

ఈ క్రూరత్వము వెంటనే చెదరిపోయిన యూదులందరిని వెంటాడెను. గ్రీకు రాజు విగ్రహారాధికుడైన ఆథేనియస్ రాజు ద్వారా యూదా ప్రజలందరు కూడా విగ్రహారాధన చేయవలెనని, ఆ విధముగా చేయుటకు నిరాకరించిన వారందరిని క్రూరముగా హత్యచేయబడునని ఆజ్ఞాపించెను. ఇదే సమయంలో అనగా క్రీ॥పూ॥ 167లోనే దేవాలయంలో జ్యూపిటర్ ఒలంపస్ అను దేవతయొక్క విగ్రహము ప్రతిష్ఠ చేయబడెను. ధర్మశాస్త్రము యొక్క పుస్తకములు కాల్చివేయ బడెను.

స్త్రీలు హింసించబడిరి, వారి పిల్లలు సున్నతి చేయబడి తల్లుల మెడలకు కట్టి వీధులలో ఉంచబడిరి. ఆ తర్వాత గోడల యొక్క ఎత్తయిన ప్రాంతములలో వ్రేలాడదీయబడిరి. ఎందుకంటే ఎక్కువమంది ఆ అన్యదేవతను ఆరాధించి వెంబడించి నిజదేవుని తృణీకరించుట కంటే మరణించుటనే ఎన్నుకొనిరి అని పవిత్రుడు, వృద్ధుడు, మతాసక్తి మనో బలము కలిగిన ధర్మశాస్త్రము యొక్క ముఖ్య వైద్యుడైన ఎలియాజరు, నాయకురాలైన సలోమెనా, ఆమె యొక్క ఏడుగురు కుమారులు సాక్ష్యమిచ్చిరి. వారిని మారణాయు ధాలు భయపెట్టలేదు. క్రూరుడైన రాజు వెంటాడి పెట్టిన చిత్రహింసలకు వారు భయపడలేదు. సర్వశక్తిగల్గిన దేవుని వైపే శ్రద్ధవహించిరి గాని విగ్రహారాధనకుగాని, వేషధారణతో దాగుకొనుటకు గాని ఇష్టపడలేదు. **(సశేషం)**

# నీ సృష్టికర్త

5

దేవుని సృష్టి అద్భుతమైనది అని చెప్పడానికి మానవ శరీరం ఒక నిలువెత్తు నిదర్శనం. ఎందుకంటే మంచి చెడు, అద్భుతం, సాధారణం వంటి వ్యత్యాసాన్ని గుర్తించగలిగే, నిర్ణయించగలిగే సత్తా సామర్థ్యం దేవుడు మనిషికి ఇచ్చాడు. దేవుడు మనిషికి ఇచ్చిన ప్రత్యేకమైన సామర్థ్యానికి కారణం మానవ మెదడు.

మానవునికి మిగిలిన జీవరాసులకి వ్యత్యాసాన్ని కలిగించి, దేవుని సృష్టిలో మనిషికి ప్రత్యేక స్థానాన్ని కలిగించే శరీర భాగం మెదడు.

ఈనాటికి కూడా శాస్త్రవేత్తలకు పూర్తిగా అర్థంకాని, అత్యంత క్లిష్టమైన శరీర భాగం మెదడు.

నేటిప్రపంచంలో కనబడుతున్న విస్తృతమై సాంకేతిక అభివృద్ధికి కారణం మానవ మెదడు.

మిగిలిన జీవరాసులతో పోలిస్తే మానవునికి ప్రత్యేక స్థానాన్ని కల్పించుటకు కారణమైన మాట, ఊహ, ఆలోచన వంటి వాటికి కారణం మానవ మెదడు.

ఇంత అద్భుతమైన శరీర భాగమైన మెదడును గురించి, దాని పనితీరు గురించి కొన్ని విషయాలు ఈ సంచికలో మీ కోసం.....

మానవ మెదడు కొన్ని కోట్ల న్యూరాన్ అనబడే కణాల కలయిక. మానవ మెదడులో 1 బిలియన్ న్యూరాన్‌లు ఉంటాయి అంటే 100కోట్ల న్యూరాన్‌లు అనమాట. ఈ సంఖ్య విశ్వంలోని ఒక పాలపుంతలో ఉండే నక్షత్రాల సంఖ్యకు సమానం.

మెదడులోని ప్రతి న్యూరాన్ 1000కి పైగా న్యూరాన్స్‌తో అనుసంధానమై ఉంటుంది. అంటే మన మెదడులో 1000 ట్రిలియన్ కనెక్షన్స్ ఉంటాయి. ఒక ట్రిలియన్ అంటే లక్ష కోట్లు అంటే మెదడులో 1,000,000, 000,000,000 కనెక్షన్స్ ఉంటాయి.

న్యూరాన్స్ ఒకదానితో ఒకటి కనెక్ట్ అయ్యి ఉండే భాగాన్ని సినాప్సిస్ అంటారు.

ఈ సినాప్సిస్ ఎలక్ట్రో కెమికల్ సిగ్నల్స్‌ను పుట్టించి న్యూరాన్స్ ద్వారా ఆ సిగ్నల్‌ను పంపిస్తుంది. ఇలా మెదడులోని అన్ని భాగాలకు, అక్కడి నుండి శరీర భాగాలకు సిగ్నల్స్ పంపబడతాయి.

ఈ ఎలక్ట్రిక్ సిగ్నల్స్ గంటకు 270మైల్స్ వేగంతో ప్రయాణిస్తాయి.

మనం మేల్కొని ఉన్నప్పుడు దాదాపుగా 10–23 వాట్స్ ఎలక్ట్రిక్ పవర్ తయారు చేయబడుతుంది. ఈ శక్తి మన ఇళ్ళల్లో వాడే ఒక బల్బ్‌ను వెలిగించడానికి సరిపోతుంది.

మెదడులోని ఎడమ భాగం కుడివైపు శరీర భాగాలను, మెదడులోని కుడి భాగం ఎడమవైపు శరీర భాగాలను నియంత్రిస్తుంది. అలాగే కుడి ఎడమ మెదడులను కలిపే మరొక భాగం ఉంటుంది దానినే కార్పోస్‌కల్లోసం అంటారు. దీని వలననే మన శరీర కుడి ఎడమ భాగాలలో సమన్వయం సాధ్యమౌతుంది.

మెదడులోని ఉపరితల భాగాన్ని సెరెబ్రం అంటారు. దీనిలో నాలుగు భాగాలు లేదా లోబ్స్ ఉంటాయి. ఒక్కొక్క భాగానికి కొన్ని ప్రత్యేకమైన విధులు ఉంటాయి.

ఫ్రంట్ లోబ్ మన తార్కిక ఆలోచనలు, తప్పొ ఒప్పొ అని నిర్ణయించడానికి, లాజికల్‌గా ఆలోచించడం, సమస్యలను పరిష్కరించడం వంటి ఆలోచనల సంబంధిత సిగ్నల్స్‌ను ఇస్తుంది.

పెరియేటల్ లోబ్ నొప్పి, మన ఇంటెలిజెన్స్, తెలివితేటలు సంబంధిత సిగ్నల్స్‌ను జనరేట్ చేస్తుంది.

టెంపోరల్ లోబ్ అనే మెదడులోని భాగం మనం చూసిన, వినిన సమాచారాన్ని భద్రపరుస్తుంది. మానవ మెమెరీకార్డ్ అనవచ్చు.

ఆక్సిపిటల్ లోబ్ మనం చూసిన వాటిని లోతుగా విశ్లేషిస్తుంది.

మెదడులో రెండవ భాగం సెరబెల్లమ్. దీనినే చిన్న మెదడు అని కూడ అంటారు. ఇది శరీర భాగంలోని కదలికలను నియంత్రిస్తుంటుంది.

మెదడులోని మూడవ భాగం బ్రెయిన్ స్టెమ్. ఇది మెదడును వెన్నుపాముతో అనుసంధానం చేస్తుంది. దీని ద్వారానే శరీర భాగాలు మెదడుకు కనెక్ట్ అవుతాయి. ఈ భాగం మన ఊపిరి, హార్ట్‌బీట్‌వంటి కీలక అంశాలను నియంత్రిస్తు ఉంటుంది.

మన మెదడు దాదాపు 1.3 కేజీల బరువు ఉంటుంది.

మెదడు దాదాపు 60% క్రొవ్వుతో తయారు చేయబడి నప్పటికి దానిలో దాదాపు 80% నీరు ఉంటుంది

శరీరంలో 2% ఉండే మెదడు, శరీరానికి అందే ఆక్సిజన్ మరియు రక్తంలో దాదాపు 20% ఉపయోగించుకుంటుంది.

మెదడుకు తగినంత ఆక్సిజన్ అందకపోతే మెదడులోని న్యూరాన్స్ అనబడే కణాలు చనిపోతాయి.

మానవ మెదడు ఒక సెకనులో 38వేల ట్రిలియన్ పనులు చేస్తుంది. అంటే 38,000,000,000,000,000 ఆపరేషన్స్ ఒక్క సెకనులో పూర్తి చేస్తుంది.

ప్రపంచంలోనే నెంబర్ వన్ సూపర్ కంప్యూటర్ అయిన బ్లూజెన్ అనే కంప్యూటర్ మానవ మెదడు చేసే పనిలో దాదాపు 0.002% మాత్రమే చేస్తుందట.

అంటే సూపర్ కంప్యూటర్ కంటే అడ్వాన్స్‌డ్ వర్షన్ హ్యూమన్ బ్రెయిన్ అనవచ్చు.

మానవ మెదడులో దాదాపు 2.5పెటాబైట్స్ డేటాని స్టోర్ చేయవచ్చు. అంటే 2,50,00,000జిబి డేటాను స్టోర్ చేయవచ్చు.

మానవ మెదడు గురించి మనం విశ్లేషించింది చాలా తక్కువ. ఒక్క మాటలో చెప్పాలి అంటే నేడు మనిషి అనుభవిస్తున్న విస్తృతమైన సాంకేతిక పరిజ్ఞానానికి, నేటి సమాచార వ్యవస్థకు మూలం, మన శరీర నిర్మాణం, అందులోని భాగాల సమన్వయం. దానికి కారణం మెదడు. డిజిటల్ కెమెరా, కంప్యూటర్, సెన్సార్ డివైజస్... ఇలా ఎన్నో ఎన్నో అద్భుతాలకు కారణం మన శరీరమైతే అవి ఉనికి లోకి రావడానికి కారణం మానవ మెదడు. మనకు కనిపించని మనకు తెలియని ఎన్నో అద్భుతాలను దేవుడు ఈ శరీరంలో పెట్టి మనకు ఉచితంగా ఇచ్చాడు. వాటి విలువను గ్రహించి సరియైన విధానంలో దానిని ఉపయోగించి అంతటి మహత్తరమైన సృష్టిని చేసిన దేవునికి కృతజ్ఞత కలిగి జీవిద్దాం.

**శ్రీ డేనియేల్ హోటన్**

## చందాదారుల వివరములు

రెవ.డా॥ వి. విజయకుమార్, బొబ్బిలి - 5000/-
మేరిసలోమి, సిరివెళ్ళ, కర్నూలుజిల్లా 5000/-
శ్రీమతి వై. సంధ్యారాణి, ఒంగోలు - 2000/-
అపొ. ఎబినేజర్‌గారు (హైదరాబాద్)-1500 (నెలకు)
డా॥ సిహెచ్‌కె. సుష్మ ప్రశాంత్, నెల్లూరు - 1500/-
జయ, గుంటూరు (6-3-24)- 1500/-
గంధం డేవిడ్ నీలకాంత్ (నెల్లూరు) -1000
జి.మాణిక్యమ్మ అనంతపురం (25-3-24) 1000/-
కె. రజిని, నరసరావుపేట - 1000/-
వి. కస్తూరి, భీమవరం 500/-
శాంతాగ్రేస్, మచిలీపట్నం 500/-
పి.వి.రెడ్డి, ఒంగోలు - 500/-
బి. నెహెమ్యా, చిన్నగంజాం - 500/-
నైటింగేల్, నెల్లూరు - 500/-
మారనాత బైబిల్ సెమినరీ, విజయవాడ - 500/-
డి. శ్యామ్‌సిన్హా, బాపట్ల - 500/-
వి. రత్నమ్మ, హైదరాబాద్ 350/-
జి. కళావతి, ఒంగోలు 350/-
కె. కల్పన, గోవా - 350/-
జి. వెంకటేశ్వర్లు, కొత్తపల్లి - 350/-
సి.హెచ్.స్వయంప్రభ, చిలకలూరిపేట (18-3-24) 350/-
కె. రాజేష్, రాజమండ్రి - 350/-
యస్. గోపి, పార్వతీపురం - 350/-
పి. దేవదానం, గుంటూరు - 300/-
పి. యేసుబాబు లోకేష్, చింతలపూడి - 200/-
ఆర్. ఇన్నయ్య, గుంతకల్ - 200/-
టి. క్రిస్టియానమ్మ, నందికొట్కూరు - 350/-
జి. జార్జిథామస్, దుగ్గిరాల - 500/-
టి.యం. భగవాన్‌దాస్, కదిరి (7-3-24) - 350/-
కె. విజయకుమార్, ఒంగోలు (1-3-24) 350/-

# సాక్ష్యము నా జీవిత ఆధారం క్రీస్తు

నేను మూఢనమ్మకాలగల నిష్టగల సస్సాంప్రదాయ ముస్లిమ్ కుటుంబములో జన్మించాను. మా నాన్నగారు నిఖచ్చిగా నిలిచిన ముస్లిమ్ విశ్వాసి. ఐదు సంవ్సతరాల వరకు వారికి సంతానయోగం లేదు. నాన్న ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు ఉద్యోగిగా పని చేసేవారు. విచార గ్రస్తురాలైన మా అమ్మ పరిస్థితిని గ్రహించి నాన్న గారి ఆఫీసులో పనిచేసే పోలీస్ కానిస్టేబుల్ వారిని దర్శించారు. మా అమ్మ ఎన్నో హిందూ దేవతలను, అల్లాను, ముస్లిమ్ విశ్వాసంలో భక్తితో ప్రార్ధనలు చేసినను బిడ్డలు కలుగలేదుని దుఃఖపడ్డారు.

కానిస్టేబుల్ గారు క్రీస్తు విశ్వాసి. యేసుక్రీస్తు నిజమైన దైవం. ఎవరైనా సరే దేవుని ఆశ్రయించి ఆయన నామమున ప్రార్థిస్తే, ప్రార్థనలకు తప్పక జవాబు దొరుకుతుంది అని చాలా నిశ్చయతతో చెప్పి ప్రార్థించడానికి ప్రోత్సహించారు. క్రీస్తే ఉత్తముడని రుచిచూచి తెలిసికోమని తెల్పారు. పర్యవసానంగా అమ్మ "ప్రభువా, నీవుంటే, సజీవుడవైతే నాకు ఒక బిడ్డను ప్రసాదించండి" అని ప్రార్థించారు. ఆ తర్వాత కొన్ని రోజుల్లోనే అమ్మకు సంతానం కలిగింది.

సంతాన ప్రాప్తి అనుభవంతో మొదలైన ఆమె విశ్వాసం మరింతగా దృఢపడింది. ఒకసారి మా పెద్దన్నయ్య మహమద్ ఖాజా సుల్తాన్ అహమద్ 2 సం॥ల వయస్సులో పడకగదిలో రాత్రి కాంతినిచ్చే అతి చిన్న బల్బ్‌తో ఆటలాడసాగాడు. అకస్మాత్తుగా అది చేతిలో పగిలింది. చిన్న ముక్కలుగా చింది కనుగ్రుడ్డును తాకింది. అది పల్లెటూరి ప్రాంతం. అమ్మ, అన్నయ్య మాత్రమే ఉన్నారు. చాలా ఆందోళనతో "ప్రభువా, నా బిడ్డ కన్నులు సరిచేయండి, భవిష్యత్తు అంధకారము కాకుండా మీరే చూడండి" అని అమ్మ ప్రార్థించసాగారు. ఆ రాత్రి "నాకు మొర్రపెట్టుము, నేను నీకు ఉత్తరమిచ్చెదను. నీవు గ్రహింపలేని గొప్ప సంగతులు గూఢమైన సంగతులను నీకు తెలియజేతును"యిర్మియా 33:3 అన్న రీతిగా ప్రభువు అమ్మతో "భయపడకుము, బాబు కంటిలో గాజుముక్కను చూడలేదా? ఆ చిన్న గాజు ముక్కను జాగ్రత్తగా తీసివేయి. నీ బాబు పూర్తిగా బాగుపడును"అని స్పష్టంగా మాట్లాడి అద్భుతము చేసారు. ఈ సంఘటనతో అమ్మ ప్రభువుని పూర్తిగా నమ్ముట జరిగింది.

నేను, బాల్యంలో ముస్లిమ్ మతాచారాలలో పెరిగినందున చాలా జాగ్రత్తతో ఇస్లామ్ పద్ధతులను ఆచారాలను విశ్వాసాలను అనుసరించేవాడిని ముస్లిమ్ సమాజం ద్వారా మా కుటుంబీకులమంతా ఘోరమైన ద్వేషాన్ని, అయిష్టతను ఎదుర్కొన్నాము. నేను మా తోబుట్టువులందరిలో ఆఖరివాడిని. ఏడవసంతానం. మా పై జరిగిన బాధాకరమైన మానసిక హింసాత్మక వాతావరణాన్ని కళ్ళారా చూచాను. సాంఘిక దురాచారాలు, హింస, న్యూనతా భావంతో గడిచింది నా బాల్యం. అవమానపరిచే సంఘటనలన్నీ అనుభవించాము. వీటన్నిటికి కారణం ఎవరో కాదు సనాతనాచారాలు పాటించే మా తండ్రి మహమద్ హిస్సాముద్దీన్ మరియు ఇస్లాము మత సంఘ సంస్కర్తల సమాజం.

నా బాల్యమంతా ఏదో తీరని బెంగ,భయాలు,దిగుళ్ళు, ఆందోళనతో గడిపాను. నా మనస్సంతా మానసిక గాయాలతో శూన్యమైంది. జ్ఞాపకశక్తి కోల్పోయాను. తెలివి జ్ఞానం నాకే మాత్రం ఉండేది కాదు. ప్రభువు మాటలు, వాటి శక్తిని గూర్చి మా అమ్మగారు నాకు పదేపదే చెప్పేవారు.

ప్రతి సంవత్సరము కాకినాడలో జరిగే వార్షికోత్సవ క్రైస్తవ సహవాస సభలకు హాజరయ్యేవారము. ఆ సభలలో జె.డి. మాథ్యూస్ గారి శిలువ దాని శక్తిని గూర్చిన ప్రసంగం విన్నాను. దేవుని ప్రేమ ఎంత గొప్పదైనది, క్రీస్తు నా కొరకు తన విలువైన ప్రాణము నర్పించి శిలువపై మరణించేతంటి ప్రేమ చూపిన విషయం నా హృదయాన్ని తాకింది. నా కళ్ళకు శిలువ దర్శనము కల్గిన వెంటనే నా జీవితాన్ని క్రీస్తు పాదాలపై సమర్పించాను. ఆ క్షణమే సంపూర్ణంగా నా పాపములు క్షమించబడినవనే నిశ్చయత కల్గింది. యేసు క్రీస్తు అమూల్య రక్తము నన్ను పరిశుద్ధపరచి నా హృదయంలో క్రీస్తు నివసించుచున్నాడని గ్రహించాను. ఈ ఘటన, నా జీవితంలో మలుపు నిచ్చి దేవుని చిత్తమనే నా జీవత నిచ్చెనను ఎక్కుటకు ఎంతగానో తోడ్పడింది.

నా చదువులో ప్రోగ్రెస్ కార్డులలో మార్పు చూచాను. గతంలో నాకున్న భయంవల్ల మతిమరుపు వల్ల చదువులో చాలా వెనుకబడ్డాను. దేవుని దైవిక జ్ఞానం నాలో అవివేకాన్ని అసమర్థతను పారద్రోలింది. మా హెడ్మాస్టరు గారు ఒక హిందువు. నేను గనుక పబ్లిక్ పరీక్షలో ఉత్తీర్ణుడనైతే ఎవడైనా ఘనత వహించిన ఆఫీసరు కాగలడని హేళనచేశారు. ఆయన ఆశ్చర్యపోవు రీతిగా నేను ఆ సంవత్సరం పరీక్షలలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత పొందాను. హల్లెలూయా!

లయోలా కాలేజీలో నా డిగ్రీ పూర్తి చేశాను. మద్రాసు క్రైస్తవ కళాశాలలో పోస్టు గ్రేడ్యుయేషన్ మంచి గ్రేడుతో ముగించగల్గాను. నా 24వ యేట ఆంధ్ర ప్రదేశ్ గవర్నమెంటు ఆఫీసరుగా ఉద్యోగంలో ప్రవేశించాను. ఎంతో పోటీ ఉన్న ఆ ఉద్యోగానికై 300,000 మంది పరీక్షవ్రాయగా ఎన్నికైన 1000 మందిలో దేవుడు నన్ను నిలిపి ఘన పరిచారు. దేవునికి స్తోత్రము. నేను నా జీవితాన్ని నా పద్నాల్గవ ఏట ప్రభువునకు సమర్పించుకున్నాను. యేసుప్రభువు నా పట్ల నమ్మదగిన దేవునిగా నన్ను ఆశీర్వదించారు. నాకు ప్రత్యేక ఉద్యోగమిచ్చారు.

1996 సం॥ములో న్యూజిలాండ్‌లో శాశ్వతంగా ఉండే అవకాశం లభించింది. సరిగ్గా 6 వారాలలో అన్నీ సమ కూరాయి. నేను ప్రార్థనలో "ఇదే యెహోవా వాక్కు నీ దేవుడైన యెహోవా నీ మార్గములన్నిటిలో నీకు తోడుగా నుండును. నీ కార్యక్రములను సఫలము చేసి నిన్ను ప్రగతితో నడిపించను" అన్న మాటలు విన్నాను.

నేను న్యూజిలాండ్ వెళ్ళిన తర్వాత బిసినెస్ స్టడీస్‌లో మాస్టర్స్ చేసాను. మాస్సీ విశ్వవిద్యాలయం. ఆ తర్వాత సంతోష వాణి నూతులపాటితో వివాహం హైదరాబాదులో జరిగింది. మా వివాహానికి పూర్వమే నా భార్య వాణికి రక్షణానుభవం ఉంది. ఇప్పుడు మాకొక కుమార్తె జోయిస్ ప్రిన్సెస్ హోటన్. జీవితాలను మార్చే దేవుడు యేసు .తన మందను మంచి కాపరిగా సంరక్షించి చూచుకొనే దేవుడు. మన హృదయాలను హత్తుకొనేంతగా ప్రేమించే దేవుడు. ఎంత లోతుగా క్షమాపణ పొందగలమో అంతగా మన హృదయాలను ప్రేమతో స్పందింపచేయగల దేవుడు.

యేసు లేనిదే మా జీవితాలు యీ నాడు యీ స్థితిలో ఉండేవి కావు. మేమేమై ఉన్నామో కేవలము క్రీస్తు వలననే. నా జీవితానికి, నేడు నేను అనుభవిస్తున్న వైభోగవంతమైన జీవితానికి ఆధారం, ఆరంభం క్రీస్తే అని చెప్పడానికి క్రీస్తు సాక్షిగా సంతోషిస్తున్నాను.

ప్రియ చదువరీ, దయతో జ్ఞాపకం చేసికొనండి. యేసును స్వీయ రక్షకునిగా అంగీకరించి ఆయన శక్తి గల రక్షణను, క్రీస్తును మీ హృదయంలో చేర్చుకొనండి అది కేవలము మీ నోటితో స్పష్టంగా అడిగి, నా జీవితంలోకి ప్రభువుగా రండి అని యేసు హృదయంలోకి పూర్తిగా ఆహ్వానిస్తేనే రక్షణ కార్యం జరుగుతుంది.మీ శేష జీవితం దేవుడే చూచుకొనును.యెహోవా యీరే. ఆది 22:14.

ఆనందించండి మరలా చెప్పుదును ఆనందించుడి. ఫిలిప్పీ 4:4 దేవుడు మిమ్ములను దీవించుగాక, ఆమేన్.


## ఇంటర్నెట్‌లో తెలుగు బైబిల్

**మీరు ఎక్కడున్నా సరే, మీ స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లలో తెలుగు బైబిల్ చూడవచ్చును. అంతేకాక తెలుగు-ఇంగ్లీషు ప్యారలల్ బైబిల్, తెలుగు ఆడియో బైబిల్, తెలుగు బైబిల్ ఎన్‌సైక్లో పీడియా, తెలుగు ఆడియో, వీడియో పాటలు, తెలుగు పాటల రచనలు, అద్భుత సాక్ష్యములు, బైబిల్ వాల్‌పేపర్స్, తెలుగు క్రైస్తవ పుస్తకములు ఇంకా మరెన్నో మీ కోసం... నేడే దర్శించండి...**

**www.onlinetelugubible.net**

ఆధునిక దృక్పథం

క్రొత్త కోణాలు

# 4. పదిమంది కన్యకలు

**యేసు చెప్పిన ఉపమానాలన్నింటిలో బహు సుందర కథా శిల్పఖండం. గద్యరూపంలో చెప్పిన పద్యకావ్యం. ఒక చిత్రవర్ణ పటాన్నెన్ని విధాలుగా వర్ణించవచ్చో అన్ని విధాల భాష్యాలు చెప్పవచ్చు. ఈ కథ ఆయా మతాల్లో ఆయా నీతిబోధలు చేయటానికి రకరకాలుగా మార్చబడింది. ఒక పెండ్లి కుమారుడు ఆమోదించగల ప్రవర్తనకు ఒదగగల హృదయం, లోబడగల చిత్తం ఇందు పొందుపరచబడింది. ఇది కేవలం బుద్ధిగల, బుద్ధిలేని కన్యకల తారతమ్యాన్ని చూపే నీతికథగాదు. సర్వ సంసిద్ధంగా వేచి ఉండటంలో గల ఆశీర్వాదాన్ని చిత్రించే ఆధ్యాత్మిక పరమార్థానికి జనరంజకమైన జానపద సంఘటన.**

పదిమంది కన్యకలు ఉపమానం మత్తయి(25)లో మాత్రమే ఉంది. అందలి కీలక బోధ గ్రహించాలంటే యేసు ప్రభువు యొక్క రెండు రాకడలను గురించి కొంతైనా తెలియాలి.

స్వంత బుద్ధిపూర్వకంగా తనను ప్రేమించి సహవాసం చేయగల జీవిని కోరి దేవుడు నరుణ్ణి సృష్టించాడు. దేవుడు పరిశుద్ధుడు కనుక ఆయనతో సహవాసానికి నరుడు పరిశుద్ధంగా ఉండాలి. పరిశుద్ధత దేవుని ఆజ్ఞల ప్రకారం జీవించడం ద్వారానే కలుగుతుంది. అయితే, నరుడు ఆజ్ఞాతిక్రమం చేసి దేవుని సహవాసం నుండి వేరయ్యాడు. అలా తప్పిపోయిన నరుణ్ణి తిరిగి తన సహవాసంలోకి తెచ్చుకోడానికి దేవుడు చేసిన ప్రయత్నాలే పాతనిబంధన చరిత్ర. ఈసారి, మానవుణ్ణి తనలో సమాధానపరచుకొనటానికి తన జనతైక కుమారుడైన యేసు క్రీస్తును నరావతారిగా ఈ లోకానికి పంపాడు.

**యేసు మొదటి రాకడ**

యేసు దేవుడైయుండి కూడా, రక్తమాంసాలు కలిగి, ఒక ఊరు, వాడ, ఇల్లువాకిలి, తల్లిదండ్రులుగల చారిత్రాత్మక వ్యక్తిగా ఈ లోకంలో పుట్టాడు. ముప్పై సంవత్సరాలు తండ్రి యింట్లోనే వడ్రంగం చేశాడు. ఆ తరువాత మూడున్నర సంవత్సరాలు పాలస్తీనా లోపల వెలుపల నలుమూలల కాలినడకను తిరిగి దేవుని గురించి బోధించాడు. అనేక శారీరక, మానసిక, ఆత్మీయ వ్యాధుల్ని మాటతో, స్పర్శతో నయంచేశాడు. దుష్టశక్తుల మీద అధికారం ప్రదర్శిస్తూ అద్భుతాలు చేశాడు. తన స్వజాతి యూదా మతోన్మాదుల చేతుల్లో దారుణ సిలువ మరణం పొంది, సమాధి చేయబడ్డాడు, మూడవరోజు పునరుత్థానుడై లేచాడు. నలభైదినాలు ఆత్మ స్వరూపంలో భూలోక సంచారం చేశారు, తన శిష్యులను కలిసి బలపరచాడు, ఆకాశానికి ఆరోహణుడయ్యాడు, తండ్రి కుడిప్రక్క సింహాసనాసీడై మానవుల విషయం విజ్ఞాపన చేస్తూ ఉన్నాడు, తిరిగి వస్తానని శిష్యులకు వాగ్దానమిచ్చాడు.

**పరలోకరాజ్యం**

యేసు పరలోక రాజ్యాన్ని భూలోకంలో స్థాపించాలని వచ్చాడు. పరలోకరాజ్యమంటే మానవుడు దేవునితో సమాధాన సహవాసాలతో ఉండే చోటు. దానిని దేవుని రాజ్యం అని కూడా అన్నారు. ఆ రాజ్యంలో దేవుని పరిపాలన, ఆధిపత్యం ఉంటుంది. దానిని స్థాపించ వచ్చే వానినే మెస్సీయగా యూదులంతా ఎదురు చూచేవారు.

యేసుక్రీస్తును యూదులు మెస్సీయాగా గుర్తించలేదు– ఈనాటికీ, ఆ రాజ్యం సమీపంలో ఉందని బాప్తిస్మమిచ్చే యోహాను ప్రకటించాడు (మత్త.3:1). ఈ పొలికేకనే యేసు పరిచర్య ప్రారంభంలో బోధించాడు (మత్త. 4:17). పరలోక రాజ్యం యేసుతో భూలోకానికి వచ్చినట్లేనని చెప్పాడు. ఈరాజ్య ప్రకటనలో పాపక్షమాపణ ప్రధానమైంది. ఈ పాపక్షమాపణ మోషే ధర్మశాస్త్రంలోని ప్రాయశ్చిత్త బలుల మూలంగా కాదు గాని మారుమనస్సు, బాప్తిస్మముల మూలంగా కలుగుతుందనే కొత్త కోణపు భాష్యం యేసు బోధించాడు. అయితే బలుల మాటేమిటి? ప్రతి పాపి, ప్రతి పాపానికి ఏదో ఒక బలియియ్యటం కాకుండ అన్ని కాలాలలోని అందరి మానవుల అన్ని పాపాలకోసం ఏ పాపమెరుగని యేసు ఒక్కడు సిలువ మీద చిందించిన తన రక్తం సరిపోతుంది. ఈ క్రొత్తకోణంలో యేసుక్రీస్తు మోషే ధర్మశాస్త్రాన్ని నెరవేర్చాడు. అయితే, మానవులేమి చేయాలి? యేసుక్రీస్తును తమ రక్షకునిగా ప్రభువుగా విశ్వసించాలి. మనసులో విశ్వసించిందాన్ని బహిరంగంగా నోటితో ఒప్పుకోవాలి, దానికి బాహ్యచిహ్నంగా బాప్తిస్మం పొందాలి. వీని వెనుక మారుమనస్సు పొందాలి. మారు మనస్సంటే – యేసు చెప్పిన బోధలకు మార్గానికి వ్యతిరేక దిశలో నడిచే దశ నుండి యేసు బోధల దిశకు మారటానికి కృత నిశ్చయుడగుట (మత్త.7:23)!

ఈ పరలోకరాజ్యం భవిష్యత్తుకు చెందింది కూడ. ఈ

రాజ్యం పరిపూర్ణంగా వచ్చేది సిలువద్వారానేనని, తండ్రి చిత్తాన్ని పూర్తిగా నెరవేర్చుట ద్వారానే ఈ రాజ్యం మీద తాను పూర్ణాధికారం పొందనున్నాడని (మత్త.28:13) దుష్టశక్తుల్ని, (సాతానును) నిత్యనరకాగ్నిలో బంధించినప్పుడే ఈ వర్తమాన లౌకిక వ్యవస్థ పరిసమాప్తమౌతుందనేది క్రైస్తవ విశ్వాసం.

## పరలోకరాజ్యం - క్రీస్తు సంఘం

క్రీస్తు బోధించిన పరలోకరాజ్యం, ఆయన స్థాపించిన సంఘాలకు అవినాభావ సంబంధమున్నది కాని ఆ రెండూ తాదాత్మ్యాలు కావు. ఈ లోకమంతటిలో, క్రీస్తులో, దేవుని సంపూర్ణ విమోచనా కార్యసిద్ధి దేవుని రాజ్యమైతే, యేసుకు చెంది, ఆయన రక్షణ సువార్తనంగీకరించిన వారి సమూహం సంఘమౌతుంది. రాజు ఆజ్ఞల ప్రకారం జీవించు వారి జీవి తాల్లో పరలోక రాజ్యం సదృశ్యరూపం దాల్చుతుంది (మత్త. 11:28). అంత మాత్రాన దేవుని రాజ్యం కేవలం క్రైస్తవ సంఘ సరిహద్దులకే పరిమితం కాదు. ప్రకటన గ్రంథంలో వ్రాయబడినట్లు ప్రపంచ చరిత్రనంతటిని దేవుని రాజ్యం తన ఆశీర్వాదకరమైన విమోచనా జెండాతో దండెత్తి జయించాల్సి ఉంది. ఇది భవిష్యత్తుకు చెందింది. అంతిమ సంఘర్షణ ద్వారానే సదృశ్యమయ్యే, సంపూర్ణ విజయం, విజయంతో కూడిన సమాధానం, రక్షణ, సుస్థిరంగా స్థాపించబడుతాయి. ఇది జరగటానికి క్రీస్తు రెండవసారి రావాలి, దానినే రెండవ రాకడ అంటారు.

## రెండవ రాకడ

క్రైస్తవ విశ్వాసానికి, నిరీక్షణకు రెండవ రాకడ పరాకాష్ఠ. ప్రభువు వచ్చుచున్నాడు (1కొరిం.16:23) అనే దానికి ఆదిమ భాషలో 'మరన్ ఆత' అనగా ప్రభువు వచ్చుచున్నాడు. లేక వచ్చియున్నాడు. లేక ప్రభువా రమ్ము అనే త్రికాలార్థాలున్నాయి. ప్రభువు తిరిగి రానున్నాడని తన శిష్యులకు వాగ్దానం చేశాడు. ఎందుకొచ్చేది చెప్పాడు (1థెస్స.4:13-18, 1కొరి. 15:25, 26, మత్త.24:31, 25:31-46, కొల.3:4, మత్త.16:27). జరగాల్సిన విషయాల ఆనవాళ్ళు ఇచ్చాడు (మత్త. 24:14, 15రి, 15:51-52, మత్త. 24:37-47 మొ॥). ఇంకా యుద్ధాలు, భూకంపాలు మొదలైనవి కూడా సంభవిస్తాయి. ఆ తరువాతే అంతం వస్తుంది. ఎన్ని చెప్పినా ఆ సంవత్సరం, నెల, దినం, ఘడియ మాత్రం తండ్రికి తప్ప కుమారునికి కూడా తెలుపబడలేదని చెప్పాడు (మత్త.24:37). ఈ నేపథ్యంలో, ఆయన ఒలీవకొండ మీద కూర్చుండి. యున్నప్పుడు శిష్యులాయన యొద్దకు ఏకాంతంగా వచ్చి అడిగినప్పుడు సూచనలతోపాటు ఒక మహాసత్యాన్ని వెలిబుచ్చాడు- 'మీరనుకొనని గడియలో మనుష్యకుమారుడు వచ్చును గనుకయే మీరును సిద్ధముగా ఉండుడి' (మత్త. 24:44).

## పదిమంది కన్యకల ఉపమానం

పైన చెప్పిన సలహాను విశదీకరించటానికి యేసు పదిమంది కన్యకల ఉపమానం చెప్పాడు (మత్త.25:1-13). ఈ ఉపమానం అర్థంచేసుకొనటంలో కష్టమేమీలేదు. తూర్పుదేశాల్లో (పాలస్తీనావంటి) పెళ్ళిళ్ళు రాత్రిళ్ళు జరుగుతాయి. పెళ్ళిళ్ళలో ప్రధానాంశాలు ఊరేగింపు, విందుభోజనం. విందుకు పిలిచిన అతిథులంతా వేరే దీపాలు లేని వీధుల్లో దివిటీలు పట్టుకొని ఊరేగుతారు. ఈ అతిథుల్లో పదిమంది కన్యలున్నారు. వీరిలో పుట్టుకతోనే అయిదుగురు బుద్ధిగలవారు, ఐదుగురు బుద్ధిలేని వారు కారు. ఐదుగురు, ఎట్నుండి ఎటువస్తుందోనని ముందాలోచనతో తమ దివిటీలతోపాటు అదనపు నూనెతో బయలుదేరారు. వారు బుద్ధిమంతులనిపించుకోటానికి ఈ ముందాలోచనతో కూడిన సిద్ధపాటే కారణం. తక్కిన అయిదుగురు బహుశ అతి తెలివిగలవారు. ఎంతనూనె పడుతుందో అంచనావేసి సరిపోతుందనుకొన్నంత వరకే నూనె దివిటీల్లో పోసుకున్నారు. పెళ్ళికుమారుడు రావటం ఆలస్యం అయింది. తూర్పుదేశాల్లో ఆలస్యాలు మామూలే. అయినా, కొందరు అందుకు సిద్ధపడరు. అదే వారి బుద్ధిలేని తనం. పదిమంది కునికి, నిద్రపోయారు. నడిజామున పెళ్ళి కుమారుడు వస్తున్న సందడి విని అందరూ లేచారు. గబగబ మకిలి పట్టిన దివిటీవత్తుల్ని సరిచేసుకున్నారు. వారు కునుకు తీసినప్పుడు కూడా దివిటీలు తగ్గు వత్తితో మండటంవల్ల నూనె అయిపోయింది. అదనంగా నూనె సిద్దెలు తెచ్చుకొన్న ఐదుగురు నూనె పోసుకొని పెండ్లికుమారుణ్ణి ఎదుర్కొనబోయారు. అదనపు నూనె తీసుకొనిరానివారు నూనె గలవారిని నూనెనిమ్మని అడిగారు. నూనె పంచితే వారికీ వీరికీ సరిపోకపోవచ్చు కనుక నూనె లేనివారిని అంగడికి పోయి కొనుక్కోమని చెప్పారు. పెండ్లి కుమారునితో కలిసి విందు గృహంలో ప్రవేశించారు. బయట తలుపు బిగించబడింది. ఆ తరువాత ఐదుగురు కన్యకలు నూనెకొని, దివిటీలు వెలిగించుకొని పెళ్లి యింటికి వచ్చారు. తలుపులు తీయమని యాచించారు. లోనుండి వారెవరో తెలియనే తెలియదని చెప్పాడు. ఐదుగురు కన్యలకు పెండ్లికుమారునితో విందు భోజనం చేసే అవకాశం పోయింది.

ఈ ఉపమానమెంత రసవత్తరమైనదో అంత దుఃఖాంతమయింది కూడా. ఈ ఉపమానాన్ని ఎవరి సిద్ధాంతాల ప్రకారం వారు విశదీకరిస్తుంటారు. ఉన్నది ఉన్నట్లు చెప్పాలంటే నాలుగు

విషయాలు గమనార్హం.

1. ఇక్కడ సిద్దెలు, నూనె, సంసిద్ధత బాహ్య అంశాల్లో కాదు కాని ఆంతరంగిక, ఆత్మీయ శుద్ధి, సిద్ధపాటుకు సూచనలు. ఇక్కడ పదిమందికి పెండ్లికుమారుని కెదురేగాలని ఉంది. పదిమంది అందుకు అవసరమైన సరంజామాతో (వస్త్రాలంకరణ, దివిటీలు మొ॥) బయలుదేరారు. అయితే ఈ పది మందిలో కొన్ని మౌలిక బేధాలున్నాయి. వారిలో ఐదుగురికి బాహ్య అభిమానముందిగాని ఆంతరంగిక లోతు అనుభవం లేదు. వారిని ఆచారబద్ధ మతావేశం గలవారికి పోల్చవచ్చును.

2. ఒక హఠాత్పరిణామానికి సిద్ధపడి ఉండాలి. అసలు పరిణామమేమైనా మన జీవితాన్ని ప్రభువు నేర్పిన విధంగా జీవిస్తూ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలే కాని ఆయన వచ్చే వేళావిశేషాలను బ్రాకెట్లు అనే జూదమాడేవాళ్ళు అంచనాలు కట్టినట్లో, తనిఖీ అధికారులు వచ్చే తేదీలకు ముందు హడావిడిగా బూటకపు సిద్ధపాటు పడటమో సరికాదని తెలిపే ఉపమానం.

3. నూనె దేవుని కృపకు పోలిక. రెండవ రాకడలో ఒకరి నూనెను ఇంకొకరికి ఇయ్యలేరు, పొందలేరు. రక్షణ ఎవరిది వారిదే. దేవునితో ఏ ఆత్మ సంబంధము ఆ ఆత్మకే. సమయమున్నప్పుడు సువార్త వినవచ్చును, రక్షణలో ప్రవేశించవచ్చును. కనుక సమయమున్నప్పుడే సిద్ధపడవలయును. ఒకరన్నారు – మొదటి రాకడవలన నేర్చుకొని సిద్ధపడేవారు రెండవ రాకడ విషయంలో ఆందోళనపడనవసరం లేదని, పాఠాలన్నీ బాగా చదివి సిద్ధంగా ఉన్నవారికి పరీక్షలెప్పుడు వస్తేనేం, దిద్దేదెవరైతేనేం!

4. సిద్ధంగా ఉండటం సరిపడేదానికంటే కొంత అదనంగా ఉండాలి. కేవలం లోకందృష్టిలో సరిపోయే బాహ్యక్రియలు చేయటంవల్ల పెళ్ళికుమారుని ఎదుర్కొనటానికి కావలసిన కృప కలుగదు.

### ముగింపు

ఎందరో అంత్యకాల ప్రవక్తలు ఇదిగో రాకడ సమీపమై ఉందని భయపడుతుంటారు. రాకడ తమకాలంలోనే వస్తుందని ఆది క్రైస్తవులు కూడా ఎదురు చూచారు. శతాబ్దాల తరబడి చూస్తున్నారు. రాకడ ఎప్పుడనేది ముఖ్యంకాదు. నేడు, ఈ క్షణం, మనకిచ్చిన దేవుని కృపాసమృద్ధిని వినియోగించి మారుమనస్సు పొంది, ఆయన మార్గములో నిలిచిన వారికి రెండవ రాకడ ఈ క్షణంలో వచ్చినా ఆనందమే. సిద్దెలో అదనపు నూనెగల కన్యకలవలె సిద్ధంగా ఉందాం.

**వచ్చే మాసం: పది ధన్యతలు**


## కొడవటికంటిగారి రచనలు

| | | |
|---|---|---|
| 1. | మడిమెను పట్టుకొనినవాడు | రూ. 40 |
| 2. | ఆసెనతు | రూ. 150 |
| 3. | అపొస్తలుడు | రూ. 250 |
| 4. | నా చిత్తానుసారుడు | రూ. 110 |
| 5. | గుంట నుండి మింటికి | రూ. 50 |
| 6. | విశ్వాసంలో ఓ మెట్టు | రూ. 60 |
| 7. | విశ్వాసంలో మరో మెట్టు | రూ. 65 |
| 8. | తోటలో పనివాడు | రూ. 20 |
| 9. | గోత్రకర్త (యాకోబు) | రూ. 50 |
| 10. | నా కుటుంబము | రూ. 25 |
| 11. | నా దూత (బాప్తిస్మమిచ్చు యోహాను) | రూ. 50 |
| 12. | నా కుమారి (రూతు) | రూ. 60 |
| 13. | నా స్నేహితుడు | రూ. 50 |
| 14. | అంత్యదినములలోని యధార్థ ప్రవక్త | రూ. 50 |
| 15. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -1 | రూ. 65 |
| 16. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -2 | రూ. 65 |
| 17. | ప్రయాణంలో ఓ మజిలి | రూ. 65 |
| 18. | నాజరు (సమ్సోను జీవిత చరిత్ర) | రూ. 65 |
| 19. | సువార్తలలోని యేసుకథ | రూ. 75 |
| 20. | యేసుకథ రెండవ భాగం | రూ. 75 |
| 21. | యేసుకథ మూడవ భాగం | రూ. 75 |
| 22. | జీవనమంతయు | రూ. 40 |
| 23. | టాల్‌స్టాయ్ కథలు 1 భాగము | రూ. 65 |
| 24. | టాల్‌స్టాయ్ కథలు 2వ భాగము | రూ. 65 |
| 25. | ఓ చినుకునవుతా... | రూ. 30 |
| 26. | మిక్కిలి సాత్వికుడు | రూ. 150 |
| 27. | విశ్వాసము విజయము-1 | రూ. 70 |
| 28. | విశ్వాసము విజయము-2 | రూ. 70 |
| 29. | విశ్వాసము విజయము-3 | రూ. 70 |
| 30. | హదస్సా | రూ. 70 |
| 31. | మిక్కిలి సాత్వికుడు | రూ.150 |

పుస్తకములు కావలసినవారు :
రెవ. డా॥ కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర
కృపాదానంగారివీధి, క్లౌపేట, 6వ లైను
ఒంగోలు-523001
ప్రకాశం జిల్లా, ఫోన్ : 9440217726

# కృపాదానం

కనుక దేవుని దగ్గరకు వచ్చే ప్రతి వ్యక్తి, మనుష్యులకు దేవునిపట్ల దేవుడు మెచ్చదగిన భక్తి విశ్వాసములు లేవని, కేవలం దేవునికి మానవుల యెడల ఉన్న ప్రేమ మాత్రమే మనలను బ్రతికిస్తుంది అని తెలుసుకోవాలని అనేకమార్లు అనేవాడు నాయన.

కృపాదానంగారి భార్య చనిపోయిన తర్వాత అయిదు సంవత్సరాలు జీవించాడు. ఆ అయిదు సంవత్సరాలు (భార్య కాని, భర్తకాని దేవుని దగ్గరకు వెళ్ళిపోయిన) తర్వాతనే సంతానం ఆడవారైనా, మగపిల్లలైనా చూపించే ప్రేమ మోసము అని గ్రహించి, దేవుని ప్రేమ ఏమిటో అప్పుడు తెలుసుకొని దేవుని దగ్గరకు చేరువగా వస్తారు అన్నాడు.

1955 నుండి 1966 వరకు కృపాదానంగారి విశ్వాస జీవితం తెలిసిన ఆయన సంతానం, తన కోసం నిలిచిన వారిని దేవుడు ఎలా ఆశీర్వదించాడో తెలుసుకొని, కుటుంబ విశ్వాస జీవితం తెలియని వారికి తెలియజెప్పాలి.

1960లో కృపాదానంగారు ఉత్తరాది జిల్లాలకు సేవార్ధమై వెళ్ళి అన్యజనంలో నుండి ప్రభువు వైపు మరలిన భార్యాభర్తలను వెంటబెట్టుకొని ఒంగోలు తీసుకొని వచ్చారు. వారు అప్పటికి చాలాకాలం క్రితమే రామాయపట్నం థియలాజికల్ సెమినరీలో ట్రెయినింగ్ అయిన వారు. కృపాదానంగారి సహవాసంలో, ఆయన ఆర్థిక సహాయంతో ఒంగోలులో సేవ ప్రారంభించారు. వారిద్దరి సంతానం హాస్టల్లులో ఉండి చదువుకునేవారు.

కొంత కాలానికి కృపాదానంగారి సహవాసం నుండి తప్పుకొని ఒక బాప్టిస్టు సంఘ ఆరాధికునితో కలిసి కృపా దానమునకు వ్యతిరకేముగా సేవ చేయటం ప్రారంభించారు. కృపాదానంగారు భయపడి తమకు ఎక్కువ ఆర్థిక సహాయం చేసి, తృప్తి పరుస్తాడు అనుకున్నారు ఆ దంపతులు. కాని కృపాదానం వారిని ఏమాత్రం లెక్కచెయ్యలేదు.

చివరికి వారు గవర్నమెంటు వారికి, అమెరికా వారికి వేరు వేరుగా కృపాదానంగారి మీద ఫిర్యాదులు చెయ్యటం మొదలుపెట్టారు.

ఒకరోజు ఉదయాన్నే ఒంగోలు సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గారి వద్ద నుండి పోలీస్ ఒకరు కృపాదానంగారి ఇంటికి వచ్చి ఇన్స్‌పెక్టర్ పిలుస్తున్నాడని చెప్పాడు. పెద్దకుమారుడనైన నేను ఆయన ఇంట్లో లేరు నేను వస్తాను, పదండి అని తాలూకా ఆఫీసులోని ఇన్స్‌పెక్టర్‌గారి కార్యాలయమునకు వెళ్ళాను. ఇన్స్‌పెక్టర్‌గారు మీ తండ్రిగారి మీద అమెరికా ప్రెసిడెంటుకు ఒంగోలు నుండి అభ్యంతరకర రిపోర్టులు పంపించారు. అక్కడ నుండి ఈ దేశము హోం మినిస్టరు గారికి, అక్కడ నుండి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హోం మినిస్టరు గారికి అంతిమంగా సర్కిల్ ఇన్స్‌పెక్టర్ హోదా కలిగిన వారు మాత్రమే దీనిని గమనించి రిపోర్టు పంపమన్నారు అన్నాడు.

సార్! ఆ పితూరి పంపినవారి పేరు చెబుతారా? అన్నాను. ఆయన పేరు చెప్పనుకాని, అతను ఒక క్రైస్తవ లాయరు అన్నాడు.

మా తండ్రిగారు మధ్యాహ్నం మిమ్మల్ని కలుస్తారు అని చెప్పి ఇంటికి వచ్చి నాన్నకి చెప్పాను. ఆయనలో కొంచెం అయినా చలనము కనిపించలేదు. అది డిశెంబరు నెల. ఒంగోలు పట్టణ ఛైర్మెన్, ఇన్సూరెన్స్ బ్రాంచ్ మేనేజరు. గవర్నమెంటు హాస్పిటల్ సూపరింటెండ్ చివరిగా పోలీస్ సూపరింటెండెంట్ సబ్‌కలెక్టర్‌గార్లను సెమిక్రిస్మస్ ప్రోగ్రామ్‌కు ఆహ్వానించారు. అప్పటికి ఒంగోలు జిల్లా కాలేదు. సబ్ కలెక్టరుగారికి తీరుబడి లేనందున ఆయన భార్య శ్రీమతి సావిత్రమ్మ, జిల్లా అడిషనల్ పోలీస్ ఆఫీసర్ భార్యగారు, శర్మ కాలేజి ప్రిన్సిపాల్, తెలుగు పండిట్ దారా రామనాధ శాస్త్రి మున్నగు పురప్రముఖులు వచ్చారు. మరునాడు ఆంధ్రప్రభ దినపత్రికలో చాలా పెద్ద ఫోటో మొదటిపేజీ మొత్తం సరిపోయేటంతటిది వచ్చింది. అప్పుడు ఇన్ని దినపత్రికలు లేవు. మొత్తం ఆంధ్రాకి విజయవాడలో

మాత్రమే ప్రింటు అయ్యేవి. కృపాదానంగారితో సర్కిల్ ఇన్స్‌పెక్టరుగారిని కలవరా? అని అడిగాను. ప్రభువే వారికి సమాధానము ఇస్తాడు అన్నాడు. ఒంగోలులో కృపాదానం గారు నిర్వహిస్తున్న అనాధ శరణాలయము ఆంధ్రప్రదేశ్ అంతటా చెప్పుకోబడినది. నాటినుండి పోలీసు సూపరింటెం డెంటుగారి భార్య అప్పుడప్పుడు కృపాదానంగారి శరణాల యమును దర్శిస్తూ ఉండేవారు.

ప్రత్యర్థులు కృపాదానంను ఏమి చెయ్యలేక ఒక రాత్రి అనాధ శరణాలయమునకు నిప్పు పెట్టారు. ఒంగోలు మున్సిపల్ కమీషనర్‌గారు తాత్కాలిక షెడ్స్ వేసి పిల్లలను అందులో ఉంచారు.

కృపాదానంగారిని ఎరిగిన సేవకులు అన్ని పట్టణ ముల నుండి ధనము పంపినందున తాటాకుల ఇల్లు బదులు మూడు నెలల్లో పక్కా బిల్డింగ్ ప్రభువు తయారు చేయించాడు.

1946లో రెండవ ప్రపంచ యుద్ధం నిలచి పోయింది. బొంబాయిలో మిలటరీలో ఉన్న కృపాదానం రిలీవ్ అయి ఒంగోలు వచ్చారు. ఆయన బరువు 160 కేజీలు. నూజివీడు ప్రాంతంలో అనేక పల్లెలలో ఆయన పాదిరిగా సేవచేశాడు. సువార్తి కునిగా అనేక గ్రామాలు తిరిగాడు. ఒక్క సంవత్సరములోనే ఆయన బరువు 78 కేజీలు అయింది.

ఆయన పొరుగు గ్రామాలలో ప్రార్థన కూటము పెట్టేటప్పుడు వారిని భోజనము ఏర్పాటు చేయుటకు ఒప్పు కొనేవాడు కాదు. సాధ్యమైనంత వరకు నెలలో రెండుసార్లు సంపూర్ణ రాత్రి ప్రార్థనలు ఏర్పాటు చేసి గ్రామములో పూర్తిగా ఆహారం నిషేధించేవారు. అయ్యా మీకు ఆహారం పెట్టడం మాకు ఆశీర్వాదకరము కదా అని సంఘస్తులు అడిగితే నేనే కాదు మీ ఇంటికి ఇంకా చాలామంది సువార్తికులు వస్తారు. వారి ద్వారా ఆ దీవెనను పొందండి అనే వాడు.

1965లో ప్రారంభమైన విదేశీ పర్యటన 1985 వరకు కొనసాగినది. మన భోజనం అక్కడ దొరకదు. ప్రత్యేక భోజన సదుపాయములు అవసరము లేకుండినవి.

కృపాదానంగారికి షుగర్ కాని బి.పి.కాని లేవు. పల్లెలకి వెళ్ళినపుడు బస్సు అందకపోతే తోటి సువార్తికులతో కలసి 10-15 కిలోమీటర్ల వరకు నడిచేవాడు. కొంచెం ఆగి వెనుక బస్సులో వెళ్దాము అంటే ఆరోగ్యం కోసం నడవాలండి అనేవాడు.

తన పదిమంది సంతానమును మూడు సంవత్సరాలు ఆకలితో ఉంచినప్పటికి, ఆ పై సంవత్సరాలలో మూడు శరణాలయములలో వేలాదిమందికి ఆహారం అందించాడు. ఆయన నడిపిస్తున్న శరణాలయాలలో అయిదు సంవత్సరాల వయస్సు నుండి కాలేజి చదివే వయస్సు వారు అనేకులు పోషించబడ్డారు. సమృద్ధియైన భోజనం వారికి అందించ బడేటట్లుగా చూడటానికి ఆయన చాలా శ్రద్ధను కనబరిచే వాడు. నాలుగు దఫాలుగా ప్లేట్లలో భోజనం ఇచ్చేవారు. అందులో మొదటి దఫాలో ఆరు సంవత్సరముల లోపల వయస్సు గలవారు. మొదటి దఫాలో పిల్లలకు అన్నం సరిపోతుందో లేదో వ్యక్తిగతముగా ఇచ్చేవాడు. వారిని అడిగి వారికి ఆ భోజనము సరిపోకపోతే రెండవ దఫాలో పెట్టేవాడు. అలా నాలుగు దఫాలలో 4వ దఫాలోని వారు తమ ఇష్టం అయిన మట్టుకు వారే వడ్డించుకొనేవారు.

శరణాలయంలోకి రెండు పూటల అనేకమంది ఆహారం కొరకు వచ్చేవారు. వారికి శరణాలయంలోని పిల్లల ఆహారం పెట్టకుండా అలా వచ్చేవారి కొరకు వేరుగా భోజనం తయారు చేయించేవాడు. కృపాదానంగారి ఇంటిలో డైనింగ్ టేబుల్ చాలా పెద్దది. 14 కుర్చీలుగల పెద్ద భోజన బల్ల. దానిని చూచినవారు ఆశ్చర్యపోయేవారు. ఇంటికి ఎవరు భోజనమునకు వచ్చినా ఆ బల్ల మీదనే భోజనము పెట్టేవారు. **(సశేషం)**

**దయచేసి పత్రిక కొరకు మీరు పంపించే చందా**
**మనియార్డర్ ద్వారా పంపదలుచుకుంటే**
**ఈ క్రింద అడ్రసుకు పంపగలరు.**
**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర,**
**ఎడిటర్, హన్నాకృప ఆధ్యాత్మిక మాసపత్రిక**
**6వ లైను, క్లౌపేట, ఒంగోలు-523001**
**ప్రకాశం జిల్లా, ఫోన్: 9440217726**

స్త్రీల విభాగం

# మరియ

యేసుక్రీస్తు వంశావళిలో పలకరించబడిన ఐదవ స్త్రీ మరియ. మరియ జీవితం ఈ సంచిక ధ్యానభాగము.

పరిశుద్ధురాలిగా, కన్యకగా, దేవునిచే ఎన్నుకోబడిన ధన్యురాలిగా, పరిశుద్ధాత్మ పూర్ణురాలిగా సువార్తలు మరియను కొనియాడుతున్నాయి. అంటే మరియ ఎంత పవిత్రంగా, ప్రత్యేకంగా జీవించిందో మనం ఆలోచించాలి.

ఆమె గోత్రము స్పష్టముగా చెప్పబడనప్పటికి ఆమె నడవడిని గూర్చి చాలా ఖచ్చితమైన సమాచారం ఇవ్వబడింది. ఎన్నో సవాళ్ళను, అవమానాలను, అనుమానాలను. ఎదుర్కొని చివరికి భర్తయైన యోసేపు ఆదరణను పొందినంతనే బేత్లెహేము ప్రయాణము చేయవలసి వచ్చింది. నిండు గర్భముతో కొండలలో లోయలలో ప్రయాణిస్తూ బేత్లెహేము చేరుకున్నది. గమ్యము చేరినప్పటికి సమస్యల దొంతరలు అంతమవ్వలేదు.

బేత్లెహేము చేరాక తల దాచుకొనుటకు స్థలము లేక ఒక పశువుల పాకలో తల దాచుకోవలసిన పరిస్థితి. క్రొత్త ప్రదేశము, అందులోను నలుమూలల చలి. ఆ చల్లగాలిలో ఒంటరిగా ఉండి ప్రసవవేదనను భరించి దేవుని చిత్తాన్ని నెరవేర్చిన ధన్యురాలు మరియ.

దేవుని దూత దర్శించింది మొదలు మరియ జీవితం అడుగడుగున సమస్యలే. దేవుని నడిపింపుతో ఒక సమస్యను అధిగమించినంతలోనే మరొక సమస్య మొదలు. ఎన్నో ప్రయాసలకు ఓర్చి లోకరక్షకుడైన యేసును భూమి మీదకు తీసుకువచ్చింది మరియ. యేసును ప్రతిష్ఠించినప్పుడు యాజకుడైన సుమెయోను మాటలు భయాందోళన కలిగించేవిగా ఉండటం. దానికి తగినట్లుగానే హేరోదుకు భయపడి ఐగుప్తుకు పారిపోవలసి రావడం. తన వాళ్ళకు దూరంగా, అన్యుల మధ్య పరాయి దేశంలో తలదాచుకోవలసి రావడం ఎంతో దుఃఖాన్ని కలిగించి ఉంటాయి.

పన్నెండేళ్ళ వయసులో యేసు తల్లిదండ్రులను విడిచి దేవాలయంలో నిలిచి తన ప్రజ్ఞతో శాస్త్రులను, పరిసయ్యులను అబ్బురపరచిన సందర్భంలో యేసు ఆలోచన ధోరణి ఆనాటి యూదా సాంప్రదాయాలకు ఆచారాలకు భిన్నంగా ఉండటం గమనించిన మరియ కొంత భయభ్రాంతురాలై ఉండవచ్చు, అందుకే యేసును ఇంటి వద్దనే ఉండునట్లు ఆజ్ఞాపించి లేదా అభ్యర్థించి ఉండవచ్చు. బహుశా మరియ కోరిక మేరకే యేసు పరిచర్యకు వచ్చునంత వరకు తల్లిదండ్రులకు లోబడి ఇంటనే ఉండెను.

కుటుంబమును అన్నివిధాల ముందుకు నడిపిస్తూ బిడ్డల భవిష్యత్తు గురించి ఆలోచించవలసిన బాధ్యత తల్లియైన మరియదే. పెద్దకుమారుడైన యేసు ఇంటిపట్టునే ఉంటూ తండ్రికి పనిలో సహాయపడటం చూసి అన్ని సవ్యంగా జరుగుతున్నాయి అనుకొనిన మరియ మానసిక పరిస్థితిని తలక్రిందులు చేసింది భర్త మరణం. ఒంటరిగా కుటుంబ బాధ్యతను భరించడం చాలా పెద్దభారం. కేవలం ఆర్థిక పరమైన ఇబ్బందులే కాదు, బిడ్డలను సరియైన క్రమములో పెంచుటలో తండ్రి స్థానాన్ని భర్తీచేయడం పెద్ద బాధ్యత.

పరిస్థితులకు అలవాటుపడి, ఎదిగివచ్చిన బిడ్డల సహకారంతో జీవితం వెలబుచ్చుతున్న మరియకు, మానసికంగా మరో ఎదురు దెబ్బ పరిచర్య నిమిత్తం యేసు ఇంటిని విడిచి పెట్టడం. ఈ విషయం తల్లిగా ఆమెను ఎంతో కృంగదీసి ఉంటుంది.

యేసు పరిచర్య ప్రారంభించినప్పుడు కాస్త ఇబ్బంది పడినప్పటికి యేసు పరిచర్య, స్వస్థతలు, బోధలు ప్రజలలో ఆయనకు పెరుగుతున్న ప్రజాదరణ చూచి తల్లిగా సంతోషించి ఉంటుంది. కానీ పెద్దకుమారునిగా యేసుతో ఉన్న అనుబంధం మరియకు ఎంతో ప్రత్యేకమైనది. కానీ ఇప్పుడు ఆ పెద్దకుమారుని వద్ద తల్లికి సమయంలేదు. తన కొరకు వచ్చిన తల్లిని సహోదరుని చూచి సంతోషంతో ఆహ్వానించక దేవుని చిత్త ప్రకారం చేయువాడే నా తల్లి నా

సహోదరులు అని యేసు చెప్పడం (మత్తయి 12:50), నెలలు తరబడి ఇంటికి రాకపోవడం, ఇంటికి వచ్చినప్పటికి స్వస్థత పొందు నిమిత్తం వచ్చు రోగులతోనే యేసుకు సమయం సరిపోవడం ఒక విశ్వాసిగా, దేవున్ని ఎరిగిన స్త్రీగా మరియ పరిస్థితులను అర్థం చేసుకొని సర్దుకొనిపోయి ఉండవచ్చు కానీ ఒక తల్లిగా ఆమెకు కాస్త బాధకరమైన పరిస్థితే. అందుకే యేసు కొరకు వచ్చిన వారితో ఆయనకు మతి స్థిమితం లేదని చెప్పడం మనం బైబిల్‌లో చూడవచ్చు. 'ఆయన ఇంటివారు సంగతి విని, ఆయన మతి చలించి యున్నదని చెప్పి ...' మార్కు 3:21

యేసు మరణ సమయం సమీపించుకొలది మారి పోతున్న పరిణామాలు మరియ పూర్తిగా గ్రహించక పోయి నప్పటికి సుమెయోను మాటలను బట్టి కొంత ఊహించి ఉండవచ్చు. యేసు ద్వారా కొంత తెలుసుకొని ఉండవచ్చు. కుమారుని మరణం ఏ తల్లికైనా భరించలేనిది.

సిలువమరణం గురించి మరియ లేశమాత్రమైన ఊహించ ఉండదు. ఎందుకంటే సిలువమరణము నొందిన వాడు శాపగ్రస్తుడు అని వ్రాయబడి ఉంది. అందులోను పండగ సమయం అందరూ ఆనందంగా ఉన్న సమయంలో రాత్రికి రాత్రే యేసును బంధించటం, నేరం ఆరోపింప బడటం, శిక్ష ఖరారు చేయడం మరియ ఊహకు అందనిది. కళ్ళముందు తన బిడ్డను చిత్ర హింసలుకు గురిచేస్తుంటే ఏ తల్లి తట్టుకోగలదు? సిలువ వేస్తుంటే గుండెలు పగిలేలా రోదించటం తప్ప ఏమి చేయలేని నిస్సహాయ స్థితి. ఎన్నో కష్టాలకు శ్రమలకు ఓర్చి నవమాసలు మోసి కని పెంచిన తన ప్రియ కుమారుని మరణం కళ్ళతో చూడటం నరకం.

ఆ సమయంలో ఆమె మనసులో కొన్ని వందల ఆలోచనలతో సంఘర్షణకు గురై ఉంటది. ఆమె మానసిక స్థితిని ఊహించటం అసాధ్యం. అయితే దేవుని కార్యాలకు సజీవ సాక్ష్యమైన తన జీవిత అనుభవము మదిలో మెదలగా మరియ మనసులో కొంత స్వాంతన పొంది ఉండవచ్చు. తన కుమారుని సిలువ మరణాన్ని దేవుని చిత్తముగా గ్రహించి ఉంటుంది.

యేసు పునురుత్థానము గురించి దేవుని దూత ద్వారా వినిన మరియ హృదయం చెప్పలేని ఆనందంతో నిండింది దేవుని చిత్తము, సంకల్పమును గూర్చిన గ్రహింపు కలిగినంతనే ఆమె యేసుక్రీస్తును తన ప్రభువుగా అంగీ కరించి క్రైస్తవురాలిగా మారింది. పెంతెకొస్తు పండగ దినమున మేడ గదిలో మరియ ఉన్నది. ' వీరితో కూడా కొందరు స్త్రీలును, యేసు తల్లియైన మరియయు ఆయన సహోదరులును ఏకమనస్సుతో ఎడతెగక ప్రార్థన చేయు యుండిరి' (అపొ.కా 1:14) వాక్‌శక్తిని, పరిశుద్ధాత్మను పొందుకున్నది. ఆ తరువాత మరియను గూర్చి ఖచ్చితమైన సమాచారం బైబిల్ గ్రంథమందు వ్రాయబడక పోయినప్పటికి యేసును అత్యంత సన్నిహితంగా ఎరిగిన వ్యక్తిగా, విశ్వాసిగా మరియ క్రీస్తును వెంబడిస్తూ శేషజీవితం గడిపిందనవచ్చు. మేడ గది అనుభవంలో తనతో పాటు తన కుమారులు ఉన్నారు. కాబట్టి మరియ తన కుమారుల సువార్త పరిచర్యకు అన్ని విధాల సహకరిస్తూ క్రీస్తు కొరకు జీవించింది అనుటలో ఎటువంటి సందేహము లేదు.

మరియ జీవితంలో ఎదుర్కొన్న సమస్యలు, శ్రమలు, ఆ పరిస్థితులలో తనను ఆదరించిన దేవుని ప్రేమను గ్రహించిన మరియ దేవుని చిత్తాన్ని అంగీకరించి సాక్ష్యార్థమైన క్రైస్తవ జీవితాన్ని జీవించి మనకు ఆదర్శప్రాయమైంది. కాబట్టి క్రైస్తవ స్త్రీలు తమ జీవితాలలో ఎదురయ్యే సమస్యలను గూర్చి చింతించక దేవుని చిత్తమును పూర్ణహృదయముతో అంగీకరించి క్రీస్తును అనుసరించుటకే ప్రాధాన్యతను ఇవ్వాలి. జీవితాల ద్వారా క్రీస్తును ప్రకటించి దేవుని చిత్తాన్ని నెరవేర్చుదాం!

## గమనిక

క్రైస్తవ కథలు, వ్యాసాలు, రచనలు, కవితలు, పాటలు మొదలగునవి మా ప్రియ పాఠకుల నుండి కోరడమైనది. ఆసక్తి గలవారు తమ తమ భావాలను మా పత్రిక ద్వారా పాఠకులకు అందించవచ్చు. క్రైస్తవకథ ఏదైనా 2 పేజీలకు మించకూడదు.

**చిన్నపిల్లల పేజి**

# ధైర్యం

స్కూల్ నుండి రావడంతోనే కాస్త డల్‌గా వచ్చి నీరసంగా సోఫాలో కూలబడింది నవ్య. ఏమైంది? ఎందుకు అంత డల్‌గా ఉన్నావు అడిగింది తల్లి స్నాక్స్ ప్లేట్ నవ్య చేతికందిస్తూ.

రెండు రోజుల క్రితం స్కూల్లో టీచర్ మీకు నచ్చిన, మిమ్మల్ని ప్రభావితం చేసిన ఒక శాస్త్రవేత్త గురించి ఎస్సే వ్రాయమంది అన్నది నవ్య. ఏదో వ్యాసం రాసి మీ నాన్నగారి అభిప్రాయం అడిగావు కదా అదేనా అడిగింది తల్లి. అవును మమ్మీ అదే గణిత శాస్త్రజ్ఞుడైన శ్రీనివాస రామానుజన్ గురించి వ్యాసం రాశాను అన్నది కాస్త చిరాకుగా. ఇప్పుడేమైంది? నీ వ్యాసం మీ టీచర్‌కి నచ్చలేదా? అడిగింది తల్లి. నచ్చింది మమ్మీ అదే నా సమస్య. నచ్చితే సమస్య ఏముందే? సరిగ్గా చెప్పు విసిగించకు బోలెడంత పనుంది నాకు అంది తల్లి కాస్త అసహనంగా.

క్లాస్ అందరిలో నేను రాసిన ఎస్సేను టీచర్ మెచ్చుకొని మ్యాథ్స్ క్లబ్ ఈవెంట్‌లో రామానుజం గురించి చెప్పమన్నది అంది నవ్య.మంచి విషయమేగా. నీ వర్క్ అందరికంటే బెస్ట్ అని టీచర్ మెచ్చుకుంటే సంతోషించాలి కానీ ఇలా డల్‌గా ఉన్నావ్ అంది పెరట్లోకి వెళ్తూ.... నవ్య తల్లి వెనకాలే పెరట్లోకి వెళ్లి అంతమంది ముందు మాట్లాడాలి అంటే భయం వేస్తుంది మమ్మీ. స్కూల్ పిల్లలు, టీచర్లు అందరూ ఉంటారు. వారి ముందు మాట్లాడాలి అంటే .... నా వల్ల కాదు అన్నది నవ్య.

నీకు తెలిసింది నలుగురి ముందు మాట్లాడటానికి ఎందుకు భయం? ఎవరికైనా ముందు అలానే ఉంటుంది. ప్రాక్టీస్ చేస్తే భయం పోతుంది. కాబట్టి ముందు నువ్వు ప్రిపేర్ అవ్వు అన్నది తల్లి నవ్వుతూ.

నవ్య తాను ప్రిపేర్ అయిన వ్యాసాన్ని భోజన సమయంలో అందరి ముందు చెప్పాలని నిశ్చయించుకొని నిలబడింది. అందరూ తననే చూడడంతో కంగారు పడింది. తల్లి ప్రోత్సాహంతో కళ్ళుమూసుకొని తను నేర్చుకున్నది కాస్త గడగడ చెప్పేసింది నవ్య. తాతయ్య నాయనమ్మ, తల్లిదండ్రులు అందరూ నవ్యను ప్రోత్సహిస్తూ చాలా బాగా చెప్పావ్ అని చప్పట్లు కొట్టారు. నవ్య సంతోషంగా భోజనం కంప్లీట్ చేసి గదిలోకి వెళ్తుండగా బాగాచెప్పావ్ కానీ కళ్ళు తెరచి చెప్తే బాగుండేది అని ఎగతాళిగా నవ్విన అన్న స్వరం వినబడగానే నవ్యకు ఎక్కడలేని కోపం వచ్చింది.

మరునాడు స్కూల్లో భోజన సమయంలో తన స్నేహితుల ముందు చెప్పడానికి ప్రిపేర్ అయింది. కానీ అటుగా వెళ్ళే వాళ్లు వచ్చేవాళ్ళు తననే చూస్తున్నట్లు, తన గురించే మాట్లాటుకుంటున్నట్లు అనిపించి హఠాత్తుగా ఆగిపోవడం, మరల చెప్పడం జరిగింది దాంతో నవ్యకు అందరిముందు తాను చెప్పలేనని అర్థమైపోయింది. కాబట్టి వ్యాసం చెప్పాల్సిన రోజు స్కూల్‌కి వెళ్ళి అందరి ముందు నవ్వులు పాలు అవ్వడం కంటే స్కూల్‌కి వెళ్ళకపోవడం నయం అనుకున్నది నవ్య.

ఇంటికి వచ్చిన నవ్యకు వాళ్ళ డాడీ ఒక గిఫ్ట్ ప్యాక్ తెచ్చిచ్చారు? ఏంటి డాడీ అడిగింది నవ్య. రేపు నువ్వు స్కూల్లో వ్యాసం చెప్పబోతున్నావు కదా! నువ్వు బాగా చెప్తావని నాకు తెలుసు అందుకే ముందుగా నీకు గిఫ్ట్ అన్నాడు తండ్రి. ఆ మాటలతో కాస్త నిరుత్సాహపడిన నవ్య ఆ ప్యాక్ ఓపెన్ చేసి చూస్తే అదొక స్టోరీస్ బుక్. ఆ బుక్ చాలా కలర్‌ఫుల్‌గా ఆకర్షణీయంగా ఉంది. థ్యాంక్స్ డాడీ అన్నది నవ్య చిరునవ్వుతో.

గిఫ్ట్ నచ్చిందా? ఇది కథ కాదు ప్రతి ఒక్కరికి అవసర మైన పాఠం అన్నాడు నవ్య ప్రక్కనే కూర్చుంటూ. ఇశ్రాయేలు దేశం మీదకు ఫిలిష్తీయులు దండెత్తి వచ్చారు. ఆ ఫిలిష్తీయులలో గొల్యాతు అనే పెద్ద యోధుడు ఉన్నాడు. ఆ గొల్యాతు అందరి కంటే ఎత్తుగా లావుగా ఉండటంతో అందరూ అతని ఆకారాన్ని చూసి, అతని మాటల్లోని ధైర్యాన్ని చూసి భయ పడ్డారు. కానీ దావీదు అనే చిన్నబ్బాయి మాత్రం గొల్యాతును చూసి ఏ మాత్రం భయపడక వడిసెల రాయితో కొట్టి గొల్యాతును చంపి ఇశ్రాయేలీయులకు గొప్ప

విజయాన్ని కలిగించాడు అన్నాడు.

నవ్య వెంటనే దావీదు ఎందుకు భయపడలేదు డాడీ అని అడిగింది. ఎందుకంటే దావీదు ధైర్యం దేవుడు. దావీదు యుద్ధానికి వెళ్తున్నప్పుడు గొల్యాతు దావీదును ఎగతాళి చేశాడు నవ్వాడు. ఇంకా అనేకులు దావీదును ఎక్కిరించి ఉంటారు అనేక రకాలైన మాటలు అని ఉంటారు అయితే దావీదు అవేమి పట్టించుకోలేదు. దేవుడు తనతో ఉన్నాడని దేవుడు గొల్యాతు కంటె గొప్పవాడని గట్టిగా నమ్మాడు కాబట్టి రాజుగా చరిత్ర సృష్టించాడు అన్నాడు తండ్రి. మౌనంగా ఉన్న నవ్యను దగ్గరకు తీసుకొని దావీదుకే కాదు నీతో కూడా దేవుడు ఉంటాడు కాబట్టి నిర్భయంగా రేపు వ్యాసాన్ని చెప్పు.ఎవరు ఎమన్నా పట్టించుకోకు అన్నాడు తండ్రి నవ్యను ముద్దాడుతూ.

నవ్య దేవుని గురించి దావీదు గురించి ఆలోచిస్తూ అలా నిద్రలోకి జారుకుంది. మరునాడు తండ్రి ఇచ్చిన స్టోరీ బుక్‌ను తీసుకొని అందులోని చిత్రాలను డాడీ చెప్పిన కథను గుర్తుచేసుకొని మనసులో చిన్న ప్రార్థన చేసుకొని స్కూల్‌కి బయలుదేరింది. వ్యాసాన్ని చెప్పడానికి నవ్య పేరు పిలవగానే నవ్యకు భయం వేసింది వెంటనే దావీదుతో ఉన్న దేవుడు తనతో ఉన్నాడు అని మనసులో తలుచుకొని చాలా ప్రశాంతంగా వ్యాసాన్ని చెప్పింది.నవ్య వ్యాసాన్ని విన్న చీఫ్‌గెస్ట్ నవ్యను అభినందించి, ఆమె ధైర్యాన్ని మెచ్చుకొని ఆమెకు ప్రత్యేకమైన బహుమతిని అందజేశాడు. గ్రౌండంతా చప్పట్లతో మారుమ్రోగిపోయింది. తనతో ఉన్న దేవునికి కృతజ్ఞతలు చెప్పిన నవ్య మరెన్నడు భయపడలేదు.

### సాక్ష్యాలకు ఆహ్వానము

మీ జీవితాలలో దేవుడు చేసిన మేలులను ఇతరులకు తెలియపరచుట ద్వారా దేవుని నామానికి మహిమ కలగడమే కాక వినినవారు విశ్వాసంలో బలపడుటకు మీ సాక్ష్యం ఉపయోగపడవచ్చు. కావున మీ అమూల్యమైన సాక్ష్యాలు మాతో పంచుకొనిన యెడలవాటిని సంతోషంగా పత్రికా ముఖంగా ప్రచురించుటకు మేము సిద్ధంగా ఉన్నాము. దేవుని నామ ప్రకటనలో మాతో పాటు మీరు పాలి భాగస్తులు కావాలని ఆశిస్తున్నాము.


## సండేస్కూల్ మెటీరియల్


| | |
|---|---|
| సండేస్కూల్ యాక్టివిటి బుక్–1 | రూ. 50/- |
| సండేస్కూల్ యాక్టివిటి బుక్–2 | రూ. 35/- |
| సండేస్కూల్ యాక్టివిటి బుక్–3 | రూ. 45/- |
| సండేస్కూల్ యాక్టివిటి బుక్–4 | రూ. 50/- |
| సండేస్కూల్ కలరింగ్ బుక్–1 | రూ. 50/- |
| సండేస్కూల్ కలరింగ్ బుక్–2 | రూ. 35/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్–1 | రూ. 35/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్–2 | రూ. 45/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్–3 | రూ. 50/- |
| మార్గము–వి.బి.యస్. మెటీరియల్ | రూ. 25/- |
| ఆత్మఫలము–వి.బి.యస్. మెటీరియల్ | రూ. 25/- |
| బైబిల్‌బాలలు–వి.బి.యస్. మెటీరియల్ | రూ. 25/- |
| ధన్యతలు–వి.బి.యస్. మెటీరియల్ | రూ. 25/- |
| బిగినర్స్ యాక్టివిటి బుక్ (ఒ.టి.) | రూ. 20/- |
| బిగినర్స్ యాక్టివిటి బుక్ (యన్.టి.) | రూ. 20/- |
| సండేస్కూల్ సాంగ్స్ బుక్ | రూ. 40/- |
| సండేస్కూల్ డైరి | రూ. 50/- |
| సండేస్కూల్ స్టోరీస్ బుక్–1 | రూ. 25/- |
| సండేస్కూల్ స్టోరీస్ బుక్–2 | రూ. 40/- |
| సండేస్కూల్ టీచర్స్ గైడ్ | రూ. 40/- |
| సండేస్కూల్ స్కిట్స్ | రూ. 40/- |
| సండేస్కూల్ మెమోరి వర్సెస్ బుక్ | రూ. 10/- |
| సండేస్కూల్ స్టిక్కర్స్ (32 ప్యాక్) | రూ. 160/- |
| **సండేస్కూల్ గేమ్స్** | |
| బైబిల్ ఇండెక్స్ గేమ్ | రూ. 200/- |
| బైబిల్ ఫ్యామిలి నేమ్స్ గేమ్ | రూ. 200/- |
| బైబిల్ నేమ్స్ గేమ్ | రూ. 300/- |
| బైబిల్ వర్సెస్ స్టార్ గేమ్ | రూ. 250/- |
| బైబిల్ నేమ్స్ ప్రిడిక్షన్ గేమ్ | రూ. 120/- |
| బైబిల్ క్విజ్ గేమ్ | రూ. 300/- |
| యానిమల్స్ అండ్ బర్డ్స్ ఇన్ బైబిల్ గేమ్ | రూ. 300/- |
| హెవెన్ అండ్ హెల్ మెమోరి వర్సెస్ గేమ్ | రూ. 450/- |

**బైబిల్ లిటరేచర్ మినిస్ట్రీ**

ఫోన్ : 9440217726



# బైబిల్ క్విజ్-05



## లేవీయకాండము 11- సంఖ్యాకాండము 8

1. నెమరు వేయగలిగి రెండు డెక్కలు లేని జంతువులేవి? (లేవీయకాండము 11)
2. శుద్ధి దినములు ముగిసిన తరువాత స్త్రీ దహనబలిగా యాజకుని యొద్దకు ఏమి తేవలెను? (12)
3. 'ఏడు దినములు' అని ఎన్నిసార్లు ఉంది? (13)
4. పవిత్రతనొందుగోరువాడు ఎన్ని దినములు తన గుడారము వెలువల నివసించవలెను? (14)
5. స్రావము గలవాడు ముట్టుకొనిన ఏ పాత్రను పగులగొట్టవలెను? (15)
6. విడిచిపెట్టుట అనే చీటి పడిన మేకను ఎక్కడ విడిచి పెడతారు? (16)
7. సమస్త దేహములకు ప్రాణాధారమైనది ఏమిటి?(17)
8. 'నీ దేవుని నామమును అపవిత్ర పరచకూడదు' రిఫరెన్స్ ఏమిటి? (18)
9. కూలివాని కూలి ఎప్పటి వరకు ఉంచుకొనకూడదు? (19)
10. 'తమ శిక్షకు తామే కారకులు' అని ఎన్ని సార్లు ఉంది? (20)
11. ఎవరు తమ తలలు బోడి చేసుకొనకూడదు? (21)
12. ఒకడు పొరపాటున ప్రతిష్ఠితమైన దానిని తినిన యెడల దానిలో ఎంత కలిపి యాజకునికియ్యవలెను?
13. పర్ణశాల పండుగను ఎన్ని దినములు జరపాలి? (23)
14. గోధుమపిండితో ఎన్నిభక్ష్యములను వండవలెను?(24)
15. దేనిని శాశ్వత విక్రయము చేయకూడదు? (25)
16. నూరు మంది ఎంతమందిని తరుముదురు? (26)
17. ఈ ఆజ్ఞలన్నీ యెహోవా ఇశ్రాయేలీయుల కొరకు ఎక్కడ మోషేకు ఇచ్చెను? (27)
18. యెహోవా ఆజ్ఞ ప్రకారం మోషే ఇశ్రాయేలీయులను ఎక్కడ లెక్కించెను? (సంఖ్యాకాండము 1)
19. యూదా కుమారులకు ప్రధానుడు ఎవరు? (2)
20. గెర్షోనీయుల పితరుల కుటుంబములో ప్రధానుడు ఎవరు? (3)
21. మెరారీయులు అహరోను కుమారులలో ఎవరి చేతిక్రింద పని చేసెడి వారు? (4)
22. కుష్ఠరోగిని ఎక్కడికి వెళ్ళగొట్టవలెనని యెహోవా మోషేకు ఆజ్ఞాపించెను? (5)
23. యెహోవా నీకు తన--- ప్రకాశింపజేసి నిన్ను కరుణించును గాక. పూరించుము. (6)
24. 9వ రోజున అర్పణ తెచ్చినవాడు ఎవరు? (7)
25. లేవీయులలో ఎంత వయస్సు నిండిన వారు పని మాని ఊరక వుండవలెను? (8)

### బైబిల్ క్విజ్ - 04జవాబులు

1.10 తెరలతో(నిర్గమ. 26:1) 2.ఒలీవలనూనె (27:20) 3.నాదాబు, అబీహు, ఎలీయాజరు, ఈతామారు (28:1) 4.ప్రత్యక్షపుగుడారము యొక్క ద్వారమునొద్ద (29:11) 5.అరతులము(30:13) 6.మరణశిక్ష (31:15) 7.3000 మంది (32:28) 8.హోరేబు కొండయొద్ద (33:6) 9.40 రేయింబగళ్ళు (34:28)10.హూరు (35:30) 11. తుమ్మ కఱ్ఱతో (36:20) 12.6 కొమ్మలు (37:18) 13.దాను (38:23) 14.యెహోవా పరిశుద్ధుడు(39:30) 15. 2వసం॥మొదటినెల, మొదటిదినమున(40:17) 16.తెల్ల గువ్వలనుగాని, పావురపు పిల్లలనుగాని (లేవీయ. 1:14) 17.ఉప్పు (2:13) 18.రక్తము మరియు క్రొవ్వు (3:17) 19.నిర్దోషమైన మగమేకపిల్లను(4:23) 20.తూమెడు గోధుమ పిండిలో10వవంతు(5:11) 21.3 సార్లు (6:17, 25,29) 22.ఎద్దు, గొఱ్ఱె, మేక (7:23) 23.2,7,1 (8:2,11,14) 24.పాపపరిహారర్ధబలి (9:8) 25 ఉజ్జీయేలు (10:4)